ప్రజాశక్తి

Vol. 1, no. 24

(Nov. 25, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 24

(Nov. 25, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు : 0-1-6

PRAJA SAKTI

Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

ప్రజాశక్తి

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 25-11-42 బెజవాడ | సంచిక 24

★ ప్రజలు ఏకంకావాలి! సమరం సాగించాలి!!

జాతీయ ఐక్యతను స్థాపించడానికి కమ్యూనిస్టుపార్టీ దేశమంతటా బ్రహ్మాండమైన వుద్యమాన్ని నడుపుతూవుంది.

జాతీయ ప్రభుత్వాన్ని సాధించడానికి ఏదయినా మార్గం వుందా అంటే, అది జాతీయ ఐక్యతకోసం దేశంలోని ప్రజలందర్నీ సమీకరించడమే!

తమ మాతృదేశమైన భారతదేశ రక్షణకు భారత ప్రజలే దీక్షబూని వుండాలి. కాని వారిచేత అలా చేయించకుండా ఈ దేశాన్ని శాశ్వతంగా తమక్రింద బానిసగావుంచుకోవాలనే వుద్దేశ్యంతో ప్రభుత్వం కాంగ్రెసు నాయకులను అరెస్టుచేసింది. కాంగ్రెసుసంస్థను నిషేధించింది. దేశమంతటా నిర్బంధవిధానం అమలు చేసింది. ఇది సామ్రాజ్యవాదుల మార్గం!

ఇప్పుడు దేశంలో సాగుతూన్న అరాచక చర్యలు, దేశరక్షణకు ప్రతికూలంగా సాగుతూన్న వుద్యమమేకాని, మరొకటికాదు. దీనివల్ల లాభం ఫాసిస్టు దురాక్రమణదారులకేగాని, మన దేశ స్వాతంత్ర్యోద్యమానికి కాదు!

ఈ అంశాలను రాచకీయంగాను, క్రియారూపంగానూ మన దేశభక్తులందరికీ నచ్చజెప్పడమే నేడు కమ్యూనిస్టులు సాగిస్తున్న వుద్యమంయొక్క వుద్దేశము. ఈ వుద్యమాన్ని గురించిన కొన్ని రిపోర్టులను ఈ వారం ప్రచురిస్తున్నాము.

ఈ జాతీయైక్యత వుద్యమం, ఈ దిగువ నినాదాలతో సాగుతూవుంది:

జాతీయ నాయకులను విడుదలచేయండి!

దేశరక్షణ ప్రతికూల చర్యలను ఆపండి!

దేశక్షేమంకోసం అన్నిపార్టీలవారు ఏకంకావాలనే విషయాన్నే మూలసూత్రంగా తీసుకొని, కాంగ్రెసు-లీగు ఒడంబడికకోసం కృషి చేయండి!

దేశరక్షణకోసం, దేశ స్వాతంత్ర్యంకోసం జాతీయ ప్రభుత్వాన్ని సాధించడానికి జాతీయైక్యతను స్థాపించండి!

సాధ్యమైన అన్ని పద్ధతుల్లోను యీ నినాదాలను ప్రజలకు అందజేశాము. సభలు, కరపత్రాలు, పోస్టర్లు మొదలయిన సాధనాలతో యీ పని నెరవేర్చాము. అనేక పట్టణాల్లోనూ, జిల్లాల్లోను అధికారులు సభలను నిషేధించారు. ఉద్యమంయొక్క వుద్దేశాన్ని తెలిపినా అనుమతి యివ్వలేదు. ఇలా జరగవచ్చునని మేము ముందుగానే అనుకున్నాము. అందుచేత యీ అధికారుల ప్రవర్తన వుద్యమాన్ని ఆటంకపరచలేదు.

రాజాజీ గాంధీగారిని కలుసుకోనీయకుండా చేయగలరు - కాని, కమ్యూనిస్టులు తమ ప్రజల్ని కలుసుకోవాలంటే యేది అడ్డగలదు? నిషేధాలు, గిషేధాలు యెందుకూ పనికిరావు.

అధికారుల నిషేధంవల్ల యీ వుద్యమం ప్రదర్శన రూపం పొందలేకపోయింది, కాని తీవ్రతలో యేమీ తగ్గలేదు. చాలా హెచ్చింది కూడాను. విప్లవ కార్యదీక్షా పరతంత్రులైన కమ్యూనిస్టులకే యిది సాధ్యము.

ఈనాడు ప్రజలలో కలిగిన కోపాతిశయం, దేశాభిమానాన్ని తప్పుదారి తొక్కించి, జపాను అనుకూల భావంగా మారుస్తూవుంది. ఈ మార్పును అరికట్టడానికి కమ్యూనిస్టు ప్రచారక దళాలు నడుం బిగించాయి. దేశంలో సాగుతూన్న అరాచక చర్యలు ప్రజల్లో ఒకలాంటి నిరుత్సాహ భావాన్ని కలిగిస్తున్నాయి. దీనిని యెదిరించి, ప్రజల్లో మళ్ళీ నిష్కళంక దేశభక్తిని పురికొల్పి, దేశ భవిష్యత్తుపట్ల, నలభై కోట్ల భారతీయుల శక్తి సామర్థ్యాలపట్ల విశ్వా-

స్వాతంత్ర్యం పొందాలి!!!

సాన్ని కలిగించడానికి యీ ప్రచారక దళాలు కృషి చేశాయి.

కృషి సఫలమయింది - అన్ని వర్గాలవారు, అన్నిచోట్ల పిలుపు అందుకున్నారు. మాతో ఏకీభవించనివారున్నూ మావాదనలను విన్నారు. చాలమంది 'విజయీభవ' అనిదీవించారు.

ఈ వుద్యమంవల్ల ముస్లిం ప్రజల్లో కలిగిన చైతన్యం విశాల హృదయంతో కూడుకొన్నది. న్యాయసమ్మతమైన తమ స్వయం నిర్ణయ హక్కుకోసం కమ్యూనిస్టులు యెంత స్వార్థ రహితంగా కృషిచేస్తున్నారో ముస్లిం సోదరులు గుర్తించారు. కాంగ్రెసు నాయకుల విడుదల కోసం, కాంగ్రెసు - లీగు ఒడంబడికకోసం ముస్లిం ప్రజలు నడుం బిగించి, తీవ్ర కృషి చేస్తేనేగాని వారికి యీ హక్కు లభించదని ప్రచారక దళాలు బోధించాయి. భారత జాతి గతి యేమైనాసరే ముస్లింలకు అక్కరలేదనే అపోహను యిలాంటి కృషిద్వారా పోగొడితేనే గాని లాభంలేదని నచ్చజెప్పారు.

ఈ వుద్యమంలో మరొక కొత్త విషయం- కమ్యూనిస్టు ప్రచారక దళాలు, ముఖ్యంగా స్త్రీ దళాలు; స్త్రీలనుండి పొందిన సానుభూతి. స్త్రీలు తమ గౌరవానికి కలుగనున్న ప్రమాదాన్ని తెలుసుకొన్నారు. జాతి గౌరవాన్ని కాపాడితేనే తమ గౌరవం నిలువగలదని గుర్తించారు; దేశరక్షణకోసం పాటుపడాలని గ్రహించారు.

ఇంతేకాకుండా ప్రచారకదళాలు చాలమంది యువకులను అరాచక చర్యలనుండి - స్వాతంత్ర్యం అన్న మంత్రంతో జాతిగొంతుక కోయడానికి వుద్దేశించిన అరాచకచర్యలనుండి- క్రమచర్యలవైపు త్రిప్పగలిగాయి. దేశరక్షణ, స్వాతంత్ర్యాలకోసం ప్రజల్ని సమీకరించాలనే పవిత్రవుద్దేశ్యంతో సాగుతూవున్న ఐక్యతావుద్యమంవైపు వీరిని త్రిప్పగలిగాయి.

ఇంతవరకు ఈ వుద్యమం పొందిన సానుభూతి మొదటి వుత్సాహాన్ని ఇంకా హెచ్చించడమేకాకుండా కొత్త వుత్సాహాన్నికూడా ఇస్తూంది జాతీయైక్యతావారానికి సంబంధించిన కార్యక్రమం స్వయం సంపూర్ణంకాదు. జాతీయైక్యతా వుద్యమానికి ఇది మొదటి మెట్టు. జాతీయప్రభుత్వాన్ని సాధించడానికి సిసలయిన జాతీయపంథా ఐక్యత పంథాయే అని దేశభక్తులందరూ గుర్తించి, దీనిలో పాల్గొనేలా చేయడానికి కమ్యూనిస్టులం కంకణంకట్టాము. విజయంపొందగలమనే ధైర్యంవుంది. ఎందుచేతనంటే ఈ మన భారతదేశం మన అందరి మాతృభూమి దీనిని ఫాసిస్టులకు జారవిడుస్తే- స్వాతంత్ర్యాన్ని పొందము సరికదా, వున్న సర్వస్వాన్ని పోగొట్టుకున్నవారమవుతాము.

రోజురోజుకి ఎక్కువమంది దేశభక్తులు ఈ సత్యాన్ని గుర్తిస్తున్నారు. రానున్న ఫాసిస్టులను ఎదిరించడానికే కాకుండా, ఇప్పటి సామ్రాజ్య ప్రభుత్వాన్ని ఎదిరించడానిక్కూడా ఏకైకమార్గం ఐక్యతామార్గమే అని కమ్యూనిస్టులం మొదటినుంచి చెబుతున్నామని వీరు అనుభవంమీదతెలుసుకుంటున్నారు. భారతజాతి ఐకమత్యం అంటే బ్రిటిషు సామ్రాజ్యవాదులకున్నంత బెదురు ఈనాడు మరెవ్వరికీ లేదు. ఈ ఐకమత్యం ఏర్పడిననాడు భారతదేశంలో తమ రాజ్యం అంతమని, మన రాజ్యం ప్రారంభమని వారికి బాగా తెలుసు.

ఈనాడు మన అందరి సర్వస్వం మంట



కామ్రేడ్ పి. సి. జోషి

గలవనుంది - కనబడినవారందరికీ యీ విషయం వివరిస్తున్నాము. అందరం ఒకటవాలి - ఒకరి క్షేమంకోసం అంతా - అందరి క్షేమంకోసం ప్రతి ఒక్కరూను! ఇదే మనకు మిగిలియున్న యేకైకమార్గం. మాతృభూమి సంరక్షణకోసం ప్రతి ఒక్కరిమీద స్వార్థ రహితమైన బాధ్యతను విధిస్తున్న యీ మార్గాన్ని అవలంబించడమే యీనాడు నిజమైన దేశసేవ అని అందరితోను చెపుతున్నాము.

అందరి క్షేమంకోసం కృషి చేస్తున్నాము- కాబట్టి విజయం తప్పక పొందగలం. కమ్యూనిస్టుల నిఘంటువులో 'విశ్రాంతి' అన్నమాట లేదు. మన ప్రజలు యేకమవాలి - సమరం సాగించాలి - స్వాతంత్ర్యం పొందాలి!

చాటండోయ్ !

చాటండోయ్ సోదరులారా—చాటండోయ్॥

ప్రపంచమంతా - ప్రచండమైన
స్వాతంత్ర్యాగ్ని - చెలరేగింది
కళ్ళు నులుముతూ - కాలం గడిపిన
కాలచక్రం - క్షమించదంటూ ॥చాటం॥

* * *

ఫేసిస్టుకూటమి - పాడైనప్పుడే
ప్రజారాజ్యము - యేర్పడుతుందని
సౌఖ్యములెన్నో - సమకూర్తాయని
సోదరభావము - పాదుకొంటదని ॥చాటం॥

* * *

కాంగ్రెసు వెనుక - లేదిక బలమని
కబుర్లుచెప్పే - కన్సర్వేట్లకు
కాంగ్రెసు ముస్లిం - అయిక్యతతోనే
గోరీకడతాం - మీ కంటూ ॥చాటం॥

* * *

బానిసత్వములో - బ్రతుకుటకంటె
ప్రజాయుద్ధములో - ప్రాణములొడ్డి
చచ్చుట మేలను - సామెత నెరిగి
పోరాడుటకై - రారండనుచూ ॥చాటం॥

* * *

రైలుస్టేషనులు - పోస్టాఫీసులు
తగులాబెట్టే - దేశభక్తులకు
స్వతంత్రమార్గం - బిదికాదంటూ
సరియగు సమరం-బిది కాదంటూ ॥చాట॥

* * *

భారతదేశపు - పావనభూమిని
ఫాసిష్టూలకు - పంచాజూపే
పంచమాంగదళ - సభ్యులకు
భావికాలపు - భారతభూమిలో
స్థానంలేదని - చాటుచు మీరు ॥చాటం॥

* * *

హిందూ ముస్లిం - ఐక్యతయే
కూల్చదోయు నీ - బ్రిటీషుతంత్రముల
దీనికొరకై - దేశభక్తులు
కృషిచేయగనూ - కదలిరండని ॥చాటం॥

* * *

భారతదేశపు - పాడిపంటలకు
భగ్గున దౌర్జన్యాన్ని - రగిల్చి
మండజేయుటకే - మనశత్రువులు
జపానువాళ్ళు - జరిగొస్తున్నారని ॥చాటం॥

—కామ్రేడ్ రావెళ్ళ హనుమంతరావు

ప్రజాశక్తి

25-11-42 బుధవారం

ఎందుకిది బుట్టదాఖలయింది ?

మన దేశంలో సామ్రాజ్యవాదుల పెత్తన మేర్పడినప్పటి నుంచీ, పరిశ్రమలు అభివృద్ధికాకుండా యెన్నో ఆటంకాలు కల్పించబడుతున్నాయి. తమ పరిశ్రమల కవసరమైన ముడిపదార్థాలు మాత్రమే మనం తయారు చేయాలి. మనదేశంలో పరిశ్రమలు అభివృద్ధిచెందితే, అవి తమకు పోటీగా పనిచేస్తాయేమోనని వారికి భయం.

కాని, యుద్ధం ప్రపంచానికంతకూ వ్యాపించింది. ఏ దేశం బలహీనమైనా, యితర దేశాల ప్రజలకు నష్టం కలుగుతుంది. పారిశ్రామికంగా బలహీనమైనదేశాలు ఫాసిస్టు రాజ్యాల కాహుతి కావడం చూస్తున్నాము. భారతదేశంకూడా పారిశ్రామికంగా బలహీన స్థితిలో ఉంటే, మనకు కూడా వాటి గతే పట్టే ప్రమాదం వుంది.

ఈ విషయాన్ని ఇటీవల అమెరికా ప్రభుత్వం గుర్తించి బ్రిటిష్ ప్రభుత్వపు అనుమతితో ఒక విచారణసంఘాన్ని మన దేశానికి పంపింది. దీనికి డాక్టరు గ్రాడీ అధ్యక్షుడు. ఈ కమిషన్ మన దేశంలో 5 వారాలు సంచారం చేసి, మే నెలలో కొన్నిసిఫార్సులు చేసింది.

1. మన దేశపు యుద్ధపరిశ్రమలలో తీవ్రమైన మార్పులు తీసుకురావాలి. కొత్తయంత్రాలు, కొత్తపద్ధతులు, ప్రవేశపెట్టి, ఉత్పత్తిని అనేకరెట్లు యెక్కువ చేయాలి (Rationalisation and regimentation). ఇతర పరిశ్రమలు కూడా యుద్ధ సామగ్రిని తయారుచేసే స్థితిలో వుండాలి. ఇందు కవసరమైన యంత్రాలు, యంత్ర సామగ్రి, అమెరికా సప్లయి చేస్తుంది. అమెరికన్ నిపుణుల సహాయం కూడా ఇండియాకు పంపబడుతుంది. యుద్ధ విమానాలు, ఓడలు కొత్తగా తయారు చేయడంకంటె, మరమ్మతుల నిమిత్తం కర్మాగారాలు స్థాపించడ మెక్కువ అవసరమని తెలియజేసింది.

2. యుద్ధవ్యవహారాలన్నీ చాకచక్యంగా నడుపబడ్డానికి యుద్ధ నిర్వహణ సంఘమొకదాన్ని (War Cabinet) స్థాపించాలి. ఇందులోవున్న సభ్యులు ఉత్పత్తికి, రహదారీమార్గాలకు, రక్షణ శాఖకు, ఆర్థిక శాఖకు, బాధ్యత కలిగి యుంటారు. అమెరికాలో మాదిరిగా, యీ సంఘానికి ప్రత్యేకాధికారాలుండాలి. ఇతర శాఖలపై ఇది ఆధారపడకుండా వుండాలి.

3. ఉత్పత్తిశాఖ సప్లయి శాఖతో ఎట్టి సంబంధంలేకుండా, వేరుగా ఉండాలి.

4. భారత దేశపు సైన్యాన్ని ఇంకా యెక్కువగా వృద్ధిచేయాలి.

"రష్యారంగం తరువాత, చైనా - బర్మా - ఇండియా రంగమే ఎక్కువ ప్రాధాన్యత వహిస్తూన్న" దనీ; "మనపరిశ్రమలు సరిగాఅభివృద్ధిచేయబడితే ప్రాచ్య ఖండంలో భారతదేశమే యుద్ధనిర్వహణానికి పట్టుకొమ్మ అయితీరుతుం"దనీ, డాక్టర్ గ్రాడీ ప్రకటించాడు. యుద్ధవిమానాల ఉత్పత్తివిషయంలోను, ఓడల నిర్మాణం విషయంలోను, ఈ కమిషన్ చేసిన శిఫార్సులు ఎక్కువ అభివృద్ధి కరమైనవి కాని మాట నిజమే. ఆధునిక యుద్ధాలలో అత్యవసరమైన విమానాలు, ఓడలు, విరివిగా లేక పోతే ఫాసిస్టు దుండగీడుల్ని తీవ్రంగా ఎదుర్కోలేం. మరొక ప్రధాన విషయం ఏమంటే, ప్రజల సహకారం లేనిదే జయప్రదమైన ప్రతిఘటన సాధ్యంకాదు. ఇందుకు ప్రజా ప్రతినిధులతో కూడిన జాతీయ ప్రభుత్వ మవసరం.

గ్రాడీ కమీషన్‌యొక్క రిపోర్టులో యీ లోపాలున్నప్పటికీ, పై శిఫార్సులనైనా ఇండియా ప్రభుత్వం అంగీకరించి యుండవలసింది. కాని, మొదటినుంచీ ఇండియా ప్రభుత్వం వీటియెడల విముఖతనే తెలియజేస్తూ వచ్చింది. జూన్ 4 వ తేదీని ప్రభుత్వ సభ్యుడైన హెచ్. పి. మోడీ అమెరికన్ పత్రికా రచయితల సమావేశంలో ఉపన్యసిస్తూ, సైన్యాన్ని తాము వృద్ధిచేస్తూనే వున్నామనీ, సంఖ్య కంటె గుణమే యెక్కువ ముఖ్యమనీ, తెలియజేశాడు. కాని సంఖ్యాబలంయొక్క ప్రాధాన్యత కూడా యెంతవుందో రష్యా - చైనా రంగాలు చూస్తే తెలుస్తుంది. ప్రజలకు విరివిగా ఆయుధాలు సప్లయిచేయడం సామ్రాజ్యవాదుల యుద్ధనీతి కాదని దీనివల్ల స్పష్టమౌతూంది.

అమెరికాలో వున్న రాజ్యాంగ పద్ధతులన్నీ ఇండియాలో దిగుమతి చేయడం సరికాదనీ, అది సాధ్యమే కాదనీ మోడీ చెప్పాడు. దీనికి కారణం లేకపోలేదు. జాతీయ ప్రభుత్వ మేర్పడితేగాని గ్రాడీ కమీషన్‌చేసిన రెండవ శిఫార్సును అమలు పరచలేరని ప్రభుత్వానికి తెలుసు.

ఇక మూడవ శిఫార్సుకు వద్దాం. ప్రస్తుత మున్న సప్లయి శాఖ యుద్ధాని కవసరమైన సరుకులు కొని, వివిధ రంగాలకు సప్లయిచేస్తుంది. కొత్త పరిశ్రమల విషయమై పూనుకొని పనిచేయడం యీ శాఖకు సాధ్యమైన పనికాదు. ఈ యుద్ధ కాలంలో డొమినియన్ ప్రభుత్వాలన్నీ (కెనడా, ఆస్ట్రేలియా మొదలైనవి) తమ తమ దేశాలలో పారిశ్రామికాభివృద్ధికి యెక్కువగా తోడ్పడ్డాయి. అక్కడ వుత్పత్తి శాఖకు, సప్లయిశాఖకు, సంబంధమే లేదు. కాని మన దేశంమీద సామ్రాజ్యవాదులకు సవతితల్లి ప్రేమ. కెనడా, ఆస్ట్రేలియాలకున్న అవకాశాలనైనా యివ్వక, భారత దేశాన్ని పారిశ్రామికంగా అణచివేస్తున్నారు.

యుద్ధ పరిశ్రమలలో కొత్త యంత్రాలు, కొత్త పద్ధతులు, ప్రవేశపెట్టి, ఉత్పత్తిని అనేకరెట్లు ఎక్కువ చేయడానికి గ్రాడీకమీషన్ కొన్ని చక్కని సూచనలు చేసింది. కాని యిందులో అనేక చిక్కులున్నాయని ప్రభుత్వసభ్యుడు పలికాడు. ఇందుకు కారణం భారతదేశపు కార్మికులకూ అమెరికన్ కార్మికులకూ ఎంతో భేద ముందన్నాడు. అయితే, కమీషన్ సభ్యులు తమ రిపోర్టులో యిలా వ్రాశారు. "భారతీయ కార్మికులలో చక్కని లక్షణాలు, మంచి శక్తులు, ఉన్నాయి. వారు మంచి నైపుణ్యంతో పని చేయగలరు. అనుకూల పరిస్థితులు వారికి కల్పించి, జీవనోపాధికి తగిన రక్షణయిచ్చినట్లయితే, వారిపై మనం పూర్తిగా ఆధారపడవచ్చు." కాబట్టి, ప్రభుత్వసభ్యుడు చెప్పిన కారణం నిజంకాదని రుజువైంది.

మొత్తం మీద హెచ్. పి. మోడీ (ప్రభుత్వ సభ్యుడు) ప్రకటించిన అభిప్రాయాల్ని బట్టి, ఇండియా ప్రభుత్వం గ్రాడీ కమిషన్ యొక్క శిఫార్సులకు వ్యతిరేకంగా ఉన్నదని ఆసమావేశంలో హాజరైన అమెరికన్‌పత్రికా రచయితలు స్పష్టంగా తెలియజేశారు. రిపోర్టులోవున్న కొన్ని భాగాలకు తప్పుడు అర్థంకూడా అతడిచ్చాడు.

ఇండియా ప్రభుత్వం కన్పరచిన ఈ వ్యతిరేకత విషయంలో అమెరికా ప్రభుత్వం యిన్నాళ్లనుంచీ తటస్థంగా ఊరుకొంది. కమిషన్ యొక్క శిఫార్సుల్ని ప్రస్తుతం ఆచరణలో పెట్టడం లేదని యిప్పుడు అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రెండు కారణాలు తెలియజేసింది. (1) మిలిటరీ పరిస్థితులు చాల వరకు నేడు బాగు పడ్డాయి. (2) భారత దేశం యొక్క చిరకాల పారిశ్రామికాభి వృద్ధిపై మాత్రమే ఈ కమిషన్ తన దృష్టిని కేంద్రీకరించింది.

కాని, యివి ఆధార రహితమైన కారణాలుకావు. ఉత్తర ఆఫ్రికాలో యిటీవల లభించిన బ్రిటిష్ - అమెరికన్ విజయాల వల్ల జర్మనీకి నష్టంకలిగిన మాటవాస్తవమే. కాని, మన దేశంలో కూడా యుద్ధ పరిశ్రమలు అతివేగంగా వృద్ధిచేయబడితే గాని ప్రపంచ ప్రజలకు సంపూర్ణ విజయం లభించదు. ఆయుధసామగ్రి విషయంలో మనకు మనం స్వయం పోషకంగావుంటూ, మన దేశ సరిహద్దులలో వున్న చైనా - రష్యాలకు కూడా సప్లయిలు పంపగలిగితేగాని ఇటు జపాన్‌ను, అటుజర్మనీని, దెబ్బతీయజాలం. చిరకాల పారిశ్రామి కాభివృద్ధికి మాత్రమే గ్రాడీ కమిషన్ పూనుకొన్న దనడం యదార్థంకాదు. "యుద్ధానంతరం ఇండియా యొక్క పారిశ్రామిక - వాణిజ్య సమస్యలతో యీ శిఫార్సుల కెట్టి సంబంధంలేద"ని డాక్టర్‌గ్రాడీ స్పష్టమైన భాషలో తెలియ జేశాడు. అమెరికాలో వున్న ఇండియా ప్రభుత్వ ప్రతినిధి సహితం ఏప్రిల్ 23 వ తేదీని యిచ్చిన ఉపన్యాసంలో యీ క్రింది విధంగా చెప్పాడు: "యుద్ధావసరాలపై మాత్రమే ఈ కమిషన్ తన దృష్టిని కేంద్రీకరిస్తుంది. ఇందుకే వీరుఇండియాకు వస్తున్నారు. యుద్ధానంతరం ఇండియా పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడడం వీరి ఉద్దేశం కాదు."

కాబట్టి, పై కారణాలు రెండూ సాకులేనని చెప్పవచ్చు.

అయితే, గ్రాడీరిపోర్టు ఎందుకు బుట్టదాఖలు చేయబడింది? ఇప్పుడు అమెరికా సహాయంతో మన పరిశ్రమలు అభివృద్ధి అయితే, యుద్ధానంతరం బ్రిటిష్ పరిశ్రమలకు బలమైన పోటీయేర్పడుతుందని భయపడే బ్రిటిష్ ప్రభుత్వంతో అమెరికా పేచీ పడ్డానికి సిద్ధంగాలేదు. ఈ సంతృప్తి విధానం ఉభయ ప్రభుత్వాల సామ్రాజ్య కాంక్షను తెలియజేస్తుంది. ఆఫ్రికాలో తమకు లభించిన విజయాలతో ఇండియాయొక్క ప్రాధాన్యతను గుర్తించకపోవడం మరొక కారణం.

సామ్రాజ్యవాదుల యీ లాలోచీ పంథాను మనం భేదించాలంటే, జాతీయ ప్రభుత్వం అవసరం. భారత దేశపు ఆర్థికసంపద నంతటినీ యుద్ధకృషికి వినియోగించగల సమర్థులు మన జాతీయనాయకులలో అనేకమంది వున్నారు. జవహర్‌లాల్‌నెహ్రూ ఇండియన్ ప్లానింగుకమిషన్ కధ్యక్షత వహించి, మన దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడాని కెంతో కృషిచేశాడు. ఆర్థిక శాస్త్రజ్ఞులు, పారిశ్రామిక నిపుణులు, ఎంతోమంది మన దేశంలో వున్నారు. ప్రజాప్రతినిధులతో కూడిన జాతీయప్రభుత్వం మనదేశంలో యేర్పడితే, వీరందరి సహాయంతో మన యుద్ధ పరిశ్రమలు విరివిగా వ్యాపించి వృద్ధిచెందుతాయి.

ఐతే జాతీయప్రభుత్వాన్ని ఏర్పరచడానికి సామ్రాజ్యవాదులు నిరాకరిస్తున్నారు. ఇందుకు సాకుగా మనదేశంలో ఐక్యతలేదని ప్రపంచప్రజల్ని వంచిస్తున్నారు. ఈ కుటిలనీతిని భేదించాలంటే, వెంటనే మనం జాతీయైక్యతకు పూనుకోవాలి. కాంగ్రెసు - ముస్లింలీగ్ ఒడంబడిక ఇందుకు ముఖ్యం. కాని కాంగ్రెసునాయకులు జైళ్ళలోవుండి, ముస్లింలీగ్ నాయకులు తటస్థవిధాన మవలంబిస్తూ, రాజాజీవంటి మధ్యవర్తులకు రాజీ అవకాశాలు నిరాకరించ బడుతూన్నప్పుడు, దేశీయు లనుసరించ వలసిన మార్గ మొక్కటే కన్పించుతూంది. బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమంద్వారా జాతీ యైక్యతను నిర్మించవలసియుంది.

చైనాలో జపాను రాక్షసులచే

శిశుహత్యలూ, స్త్రీవధలూ, దోపిడీలు, అగ్నిజ్వాలలు:

కామ్రేడ్
కాట్రగడ్డ రాజగోపాలరావు

పిచ్చి సామ్రాజ్యవాదుల నిర్బంధ విధానము ఫలితంగా దేశంలో యేర్పడిన క్లిష్ట పరిస్థితుల్ని పురస్కరించుకొని జపాను యేజంట్లు జపాను కనుకూలంగా విష ప్రచారం చేస్తున్నారు. "ఆసియా ఖండం ఆసియా వాసులకే" నన్న సూత్రంపై జపాను యుద్ధం కొనసాగిస్తోందనీ, బ్రిటిషు బానిసత్వంనుండి భారత దేశాన్ని విముక్తి చేయటానికే జపాను ప్రయత్నిస్తోందనీ; జపాన్ భారత దేశానికి మిత్ర దేశమనీ, పంచమాంగదళం వారిచే అనేక రకాల ప్రమాదకరమైన ప్రచారం కొనసాగించబడుతోంది.

జపాను బందిపోటు దొంగలు ఆసియా ఖండంలోని చైనా, మంచూరియా, కొరియా, మలయా, బర్మా మొదలైన దేశాలలోని అమాయక ప్రజా సామాన్యాన్నీ- వారి ప్రాచీన నాగరికతనూ విధ్వంసం చేయటానికి యెటువంటి భీభత్సకరమైన కార్యాలను కొనసాగించారో తెలిసికొన్నట్లయిన యీ దేశ ద్రోహుల కుతంత్రాలన్నీ సుస్పష్టమౌతాయి.

ఆసియా ఖండంలోనివైనప్పటికి జపాను రాక్షసులు సామ్రాజ్య విస్తీర్ణ కాంక్షతో - చైనా, కొరియా మొదలైన దేశాలను - రక్త ప్రవాహంలో ముంచెత్తివేశారు. శిశు హత్యలు, స్త్రీ వధలూ, దోపిడీలు, అగ్ని జ్వాలలూ ఆ దేశాల్లో తాండవమాడాయి. బ్రిటిషు సామ్రాజ్య వాదులపై ఉండే ద్వేషంతో - మన స్వాతంత్ర్యానికి, శాంతికీ భంగం కల్గునట్లు దేశంలో విబేధాలనూ, అశాంతినీ రెచ్చగొట్టు ప్రయత్నాలను కొనసాగించితే మన నెత్తిని కొరివితెచ్చి పెట్టుకొన్నవాళ్ళ మౌతాము. తమ సామ్రాజ్య స్థాపనకోసం ఆ దేశాల్లో జపాను పైశాచికులచే కొనసాగించబడ్డ ఘాతుక చర్యలు మన దేశంలో కొనసాగించబడవని యే దేశభక్తుడు కూడా అనలేడు.

రాక్షసచర్యలు, బందిపోట్లు

1937 డిశంబరు 13 వ తారీఖున జపాను సైనికులు నాన్‌కింగులో ప్రవేశించారు. 1938 మార్చి 28 వ తారీఖున దేశ ద్రోహుల కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపించారు. నాన్‌కింగులో అడుగుపెట్టిన తర్వాత జపాను రాక్షసులు అనేక దారుణ హత్యాకాండలను, భయంకర రాక్షస కృత్యాలను కొనసాగించారు.

పట్టణంలో ప్రవేశించిన నెలరోజులవరకూ దోపిడీలు, హత్యలు, మానభంగాలూ, ఇళ్ళు తగులబెట్టుటా, విచ్చలవిడిగా చేస్తూవచ్చారు. పిల్లలూ, ముదుసలులూ అనే విచక్షణలేకుండా కనబడ్డ స్త్రీనల్లా బలాత్కరించారు. ప్రతిదుకాణాన్నీ కొల్లగొట్టారు. ఉన్నదంతా దోచుకున్న తర్వాత తగులపెట్టారు. ఇలాంటి వర్ణింప శక్యంకాని అకృత్యాలన్నీ వారికి నిత్యకృత్యాలై పోయాయి.

అమాయక ప్రజాసామాన్యాన్ని హత్య చేయటంలో సైనికాధికారులు పందెములు వేసికొనేవారు. ఎవరెక్కువమంది చైనావారిని చంపితే వారు గౌరవింపబడేవారు. చైనావారిని ఖైదులో పెట్టితే తిండి పెట్టటానికి బరువుగా ఉండేది. అందువల్ల- ఈ ఆహారసమస్యను పరిష్కరించటంకోసం- దొరికిన ప్రతి చైనా దేశస్థుణ్ణీ చంపివేయటమే ప్రధానంగా పెట్టుకున్నారు. చైనా సైనికులు లొంగిపోయి ఆయుధాలను క్రిందపడవేసినా జపాను రాక్షసులు వారి ప్రాణాలను బలికొనటం మానేవారు కాదు.

విషవాయు ప్రయోగం

ప్రజలపై బాంబులవర్షం కురిపించి మారణ హోమానికి ఆహుతిచేసేవారు. అమాయక ప్రజాసామాన్యంపై విషవాయువులను ప్రయోగించి వేలకొలది చైనా దేశీయుల ప్రాణాలను జపాను ముష్కరులు తమ పొట్టనపెట్టుకున్నారు.

ఇంతే కాదు. ఇంతటితో తనివితీరక ప్రాణాలు తీసే ప్లేగు మహాజాడ్యాన్ని పట్టణాల్లో వ్యాపింపచేయటానికి జపానువాళ్ళు అనేక విధాల ప్రయత్నించారు. "బ్రేకెన్ ఫిషర్" అనే అమెరికన్ వ్యాఖ్యాత చుంకింగ్ రేడియోనుంచి బ్రాడ్‌కాస్టు చేస్తూ—

"అది 1941 నవంబరు నాల్గోతారీఖు. పశ్చిమ హ్యూనాన్ రాష్ట్రంలోని చాంగ్‌టేనగరంలో విమానదాడి హెచ్చరిక యివ్వబడింది. ప్రజ లెక్కడివారక్కడ విమానదాడి సంరక్షణకై దాక్కొన్నారు. జపాను విమానాలు వచ్చి చాల తక్కువయెత్తులో పట్టణమంతా "చక్కర్" కొట్టాయి. ప్రజలంతా బాంబులు పడతాయనే భయంతో హాహాకారాలుచేస్తున్నారు. బాంబులు పడలేదు. ఆశ్చర్యం వేసింది. చూస్తే విమానాలు తిరిగిన ప్రతిచోటా, బియ్యమూ, దూది పింజలూ మొదలైనవి వెదజల్లబడియున్నాయి.

అధికారులు సాధ్యమైనంతవరకు వాటిని ప్రోగుచేసి తగులబెట్టించారు. కొన్నింటిని ఏరి పరీక్షచేసి చూచారు. ఒకనికి వారంరోజులయ్యాక సుస్తీ చేసింది. తర్వాత 36 గంటల్లో ప్రాణం పోయింది. చచ్చిపోయిన మనిషి లక్షణాలుచూస్తే ఒకవిధమైన ప్లేగు చిహ్నాలు కనబడ్డాయి. ఈ వ్యాధితోనే మరికొందరు అవారంలో చచ్చిపోయారు. చైనాలోని సుప్రసిద్ధ వైద్యులందరూ పరీక్షచేసి ఒక రకమైన ప్లేగువ్యాధిగా నిర్ణయించారు. ఈ ప్రాంతంలో గత రెండువందల సంవత్సరాలనుంచీ ప్లేగు వ్యాధి ఎన్నడూ రాలేదు. అందువల్ల ఇది జపానువాళ్ళ ఘాతుకమేనని స్పష్టమయింది." అని చెప్పాడు.

సామాన్యంగా సామ్రాజ్యకాంక్షగల ప్రతివాళ్లూ జయించిన ప్రాంతాలలోని ప్రజలను తమ చెప్పుచేతల్లో ఉంచుకొంటే చాలని సంతృప్తి పడతారు. కాని యీ జపాను పైశాచికులకు అంతటితో తనివితీరక అమాయక ప్రజాసామాన్యాన్ని హత్యలపాలు చేస్తున్నారు.

శిశు హత్యలు

ఒక్క నాన్‌కింగులోనే జపానీయులు 42 వేలమంది చైనా ప్రజలను భీషణ హత్యాకాండలకు గురిచేశారు.

ఇందులో యే పాపమూ యెరుగని పిల్లలు, స్త్రీలు కూడా అనేకమంది వున్నారు. "షాంగ్‌హై" పట్టణాన్ని ఆక్రమించిన తర్వాత "నాన్‌కింగ్"కు వచ్చే దారిలో నిరాయుధులూ, నిరపరాధులూ అయిన మూడు లక్షలమంది చైనా ప్రజల్ని చంపివేశారు. 10 సంవత్సరాల బాలికల వద్దనుంచి 70 సంవత్సరాల ముదుసలుల వరకూ స్త్రీలను బలాత్కరించి మానభంగం చేశారు. ఇలాంటి ఘాతుక చర్యలు చైనాలో అనేకం జరిగాయి. భర్త యెదుట భార్యను బలాత్కరించటమూ, తండ్రి యెదుట కుమార్తెకు మానభంగంచేయటమూ, జపాను పశువులకు పరిపాటైపోయింది. ఒక చైనా సోదరి తనకు జరిగిన ఘోర అవమానాన్ని వర్ణిస్తూ "ఒక జపాను సైనికుడు నన్ను బలాత్కరించబోతుంటే చంకనున్న చంటిపిల్ల "అవురు" మన్నది. అందుకని ఐదు నెలల పసికూనను గొంతు నులిపి చంపివేశాడు. తరువాత ఎంతటి ఘాతుకం జరిగిందో నేను చెప్పలేను"అంది.

జపాను సైనికులు కామతృష్ణ తీర్చుకొనేటందుకు చైనా యువతులను గుంపులు గుంపులుగా పట్టుకొచ్చి బలాత్కరించేవారు. ఒకసారి తాము పట్టుకొచ్చే యువతులలో ఒకామెకు వివాహమైందనితెలిసి, ఆమె భర్తనురప్పించి,ఆమె ఎదుటనే తుపాకితోకాల్చి,చంపి తమనిప్రేమించమని బలాత్కరించారు. ఇలాంటిఘాతుకచర్యలు ఎన్నిజరిగాయో లెక్కలేదు."నాన్‌కింగు"ప్రాంతములో ఒక జిల్లానంతటినీ వేశ్యావృత్తికి ప్రత్యేకించారు.ఆప్రదేశంలో ఉండే ఏస్త్రీనైనా జపాను సైనికులు తమ కిష్టంవచ్చినట్టు ఉపయోగించుకోవచ్చు. ఏ స్త్రీయైనా జపాన్ సైనికుల కామతృష్ణను నెరవేర్చుట కంగీకరించక పోయినచో తుపాకి దెబ్బకు గురి చేయటానికి సైనికులకు సంపూర్ణాధికారం యివ్వబడింది.

నాన్‌కింగులో జపాను సైనికులు అడుగుపెట్టిన తర్వాత జరిగిన చిత్రవధలూ, శిశు హత్యలూ, స్త్రీలను బలాత్కరించుట మొదలగు రాక్షసచర్యలు ప్రపంచ చరిత్రలో మరెక్కడా కని విని యెరుగనంతటి ఘోరంగా జరిగాయి.

పంటల్ని లూటీచేశారు, ఇళ్ల తగులబెట్టారు

50 వేలమంది జపానుసైనికులు నగరంలో విచ్చలవిడిగా తిరుగుతుండేవారు. 24 లక్షల 60 వేల చైనా డాలర్ల విలువగల ఆస్తిని తగులబెట్టారు. చైనా ప్రజా సామాన్యానికి చెందిన 14 లక్షల 30 వేల డాలర్ల ఆస్తిని జపానుకు కొల్లగొట్టుకుపోయారు. ఉన్న సామానంతా లూటీచేసిన తర్వాత దాదాపు 12 వేల యిళ్ళను భస్మీభూతంచేశారు. 4 కోట్ల 10 లక్షల డాలర్ల విలువగల రైతుల ఆస్తిని నాశనంచేశారు. ఒక లక్ష యిరవై మూడువేల ఎద్దుల్ని చంపివేశారు, 6 లక్షల 61 వేల వ్యవసాయ పరికరాలను చైనా రైతులనుంచి లాక్కొని జపాను ముష్కరులు స్వాధీనంచేసికొన్నారు. కష్టపడి సేద్యం చేసికొని రైతులు పంటలు పండించుకొంటే- పంటకొచ్చిన తర్వాత జపాను నక్కలు కాజేయటమో, తగులబెట్టటమో జరిగేది. 1941 వరకు 88,873 జపాను కుటుంబాలు యీశాన్య చీనాకు వలస వచ్చారు. 2 లక్షల యకరాలకుపైగా సారవంతమైన భూమిని చైనా రైతులనుండి లాక్కొని తమ స్వంతం చేసికొన్నారు. ఏక్షణంలో ఏమిరానున్నదో తెలియక చైనాలోని నిర్భాగ్య రైతులు పిడికిట ప్రాణాలు బిగించుకొని జీవితం గడిపేవారు. రైతుల ఇండ్లల్లోని ఇత్తడి, రాగి మొదలగు లోహపు పాత్రల్ని లూటీచేసి, ఆయుధాలు తయారుచేయటానికి జపానుకు పంపించారు. తమ ఇళ్ళు, వాకిళ్లూ రక్షించుకోటానికి తయారైన 22480 మంది రైతులనూ, 4380 మంది స్త్రీలనూ జపాను బందిపోట్లు ఖూనీచేశారు. చైనాప్రజలచే గోతులుత్రవ్వించి ఆగోతులలో- అనేకమంది అమాయక ప్రజలను బ్రతికుండగానే- పూడ్చిపెట్టారు. స్మశాన భూముల్లాగా పట్టణ వీథులన్నీ శవాలతో నిండి ఉండేవి. ఆ శవాలను పాతిపెట్టటానికి కూడా ఈ జపాను పిశాచాలు అంగీకరించేవికావు.

చైనాదేశస్థుల ఆరోగ్యశాఖా భవనాలను బాంబులతో మంటలపాలుచేశారు. విద్యాలయాలను విధ్వంసంచేశారు. లక్షలకొలది పుస్తకాలను అగ్నిహోత్రునికి ఆహుతిచేశారు. ఆక్రమిత ప్రాంతాలలోని దాదాపు 250 పెద్దపెద్ద గ్రంథాలయాలను తగులపెట్టారు. చైనా పిల్లలకు బలవంతంగా జపాను భాషను నేర్పుతున్నారు. ఏ విద్యార్థియైనా జాతీయభావాలను ప్రకటిస్తే- కొరడా దెబ్బలకు గురిచేస్తున్నారు.

ఈ విధంగా పైశాచికచర్యలచే చైనాప్రజల ప్రాణ మానాలనూ, ఆస్తులనూ, సర్వస్వాన్ని కూడా కొల్లగొట్టి జపాను రాక్షసులు వికటాట్టహాసం చేస్తున్నారు.

పదండి ముందుకు పదండి! (మరో ప్రపంచం మాదిరి)

యువజనులారా ! యువతుల్లారా !
ప్రజా యుద్ధమున సైనికులారా !
పదండి ముందుకు పదండి పదండి॥
ఫాసిస్టు రాక్షసు లరుగరుగో
భారత సీమకు బయలుదేరిరి
మాన ప్రాణముల రక్షణకొరకు
ఆస్తిపాస్తుల దక్షత కొరకు
ప్రజా యుద్ధమున సైనికులారా !
పదండి ముందుకు పదండి పదండి

అవిగవిగో - అవిగవిగో
జపాను రాక్షస తుపాకి మోతలు
నాజీ "ఫైటర్ యేరోప్లేన్స్"
వినబడలేదా ? కనబడలేదా ? ॥పదండి॥

ప్రథమ శ్రేణిలో సైనికులారా !
బహూ హోషియార్
శత్రు సేనలను చీల్చండోయ్
వైరి వీరులను దునుమాడండి
ప్రజా యుద్ధమున సైనికులారా
పదండి ముందుకు పదండి పదండి-

పోనీ పోనీ ప్రథమ శ్రేణిలో
సైనికులంతా పోతే పోనీ
నిరాశ చెందకు విచారపడకు
వుదికుదికొచ్చే ఉత్సాహంతో
ద్వితీయ శ్రేణిలో సైనికులారా
పదండి ముందుకు పదండి పదండి॥
రానీ రానీ తుపాకి గుళ్ళూ
ఫిరంగి దెబ్బలు వస్తేరానీ
మరణించిన మన వీరుల గాథలు
ధగధగ మెరిసే స్వర్ణాక్షరముల
లిఖించబడునోయ్ ప్రపంచ చరిత్రలో
అధైర్యపడకు, ఆశను వీడకు
స్వేచ్ఛను పొందే సమయ మిదేనోయ్
పదండి ముందుకు పదండి పదండి॥

— జి. కోటయ్య.

అక్షరాజ్యాల బండి బోల్తా పడుతోంది

ప్రపంచ యుద్ధసమీక్ష

కామ్రేడ్
జి. రాధాకృష్ణమూర్తి

మూడు నెలలుగా గ్వెడాల్‌కనాల్‌లో అమెరికాకు, జపానుకు భీషణయుద్ధం జరుగుతూవుంది.

సోలమను దీవులు యుద్ధరీత్యా మంచికీలక ప్రదేశంలో వున్నాయి. జపాను వీటిని ఆక్రమించుకోటంలో మూడు కారణాలు వున్నాయి. ఒకటి: ఇవి తన చేతుల్లో వుంటే, ఆస్ట్రేలియాను దెబ్బకొట్టటం సులభం; రెండు: ఆస్ట్రేలియానుంచి ఒకవేళ వస్తే, దెబ్బకాచుకోటం సులభం; మూడు: వెనుక ప్రదేశం గట్టిగా వుంటేనేగాని, జపాను ముందుకు పోలేదు, క్రొత్తదాడులు, క్రొత్తవిజయాలు సంపాదించలేదు.

మిత్రమండలి పసిఫిక్‌లో జపానుమీదదాడి ప్రారంభించాలంటే, ఆస్ట్రేలియాయే ఆధారం. కాని, ఆస్ట్రేలియాచుట్టూవున్న దీవులు జపాను చేతుల్లో వున్నంతవరకు, మిత్రమండలి దాడి ప్రారంభించలేదు. ఆస్ట్రేలియాను నిరపాయంగా చేసికోవాలి.

మూడు నెలలక్రిందట అమెరికా గ్వెడాల్కనాడులో కొన్ని ముఖ్యప్రదేశాల్లోంచి జపానును తరిమివేసి ఆక్రమించుకొంది. ఈనెల ప్రారంభంలో జపాను పోయిన ప్రదేశాలను తిరిగ సంపాదించాలని దృఢ నిశ్చయంతో, ప్రబల నౌకాబలంతో కదలివచ్చింది. అప్పుడు జపానుకే నౌకాబలంలో పైచేయి. కాని, విమాన బలం ఆధిక్యంగా వుండటంవల్ల అమెరికా జపానును దాగా నిగ్రహిస్తూవచ్చింది. ఇది మొదటిదశ.

రెండవ దశ

రెండవదశలో జపాను, అమెరికా నౌకాబలాలు తల్లక్రిందులైనయి. 13 వ తారీఖున గ్వెడాల్కనారువద్ద తీవ్రనౌకాయుద్ధం జరిగింది. ఈ తీవ్రత నాలుగు రోజుల వరకు వుంది. అమెరికను నౌకాదళం చొరవతో పోరాడి అమెరికాకు గొప్ప విజయం చేకూర్చింది. జపాను నౌకాదళానికి చావుతప్పి కన్నులు లొట్టపోయాయి. సుమారు ఐదు పెద్ద యుద్ధనావలతోసహా, 28 వివిధ జపాను నౌకలు నీట మునిగాయి. సుమారు 24,000 జపాను సైనికులు మునిగిపోయారు. ఈ తీవ్రనష్టంవల్ల జపాను ఆ రంగంలో నౌకాధిపత్యం కోల్పోయింది.

న్యూ గి నీ

న్యూగినీలోకూడా మిత్రమండలే పైచేయిగా వుంది. ఈ రంగంలో యుద్ధం బహు తీవ్రంగా జరుగుతూ వుంది. ఈ దీవికి నైరుతిగా బూనా, దానికి కొంచెంవాయవ్యంగా గోనా అనే రెండు ముఖ్యదీపులున్నాయి వీటినిపట్టుకోవాలని అమెరికనులు ఒకవైపునుంచి, ఆస్ట్రేలియనులుమరొకవైపునుంచి తరుముకు వస్తున్నారు. ఈరెండు రేవులమధ్యనున్న ప్రదేశంతప్ప, చాలావరకు మిత్రమండలి ఆక్రమించుకొన్నది. తిరిగి వీరిని తరిమికొట్టాలంటే, జపాను పై రెండు రేవులనైనా దక్కించుకోవాలి. అందువలన జపాను రవాణా నౌకలద్వారా సైన్యాన్ని దించటానికి ప్రయత్నిస్తున్నది.

కాని, ఇప్పటికే ఆస్ట్రేలియనులు గోనాలో ప్రవేశించారు. అమెరికనులు బూనాలో చొరబడి జపానువారితో తారసిల్లారు. ఇంతవఱకు యీ దీవిలో వున్న జపాను సైన్యం సగం నశించిపోయింది. ఈ రెండుముఖ్య రేవులు ప్రమాదస్థితిలో వున్నాయి. ఒక ముఖ్య విషయం: జపాను సులభంగా వదలిపోదు. సోలమను, న్యూగినీ దీవులు తను సంపాదించిన సామ్రాజ్యాన్ని నిలబెట్టుకోటానికి, ఇంకా ముందుకు పడటానికి చాలా ముఖ్యం. అందువలన జపాను తన బలాన్నంతా ఒడ్డుతుంది. ఈ రంగం భవిష్యత్తు పసిఫిక్ అన్ని రంగాల భవిష్యత్తును మార్చివేస్తుంది. ఈ రంగంలోనే గనక జపాను గెలిచిందంటే, ఇటు మన ఇండియామీదో, అటు సైబీరియామీదో జపాను తప్పక విరుచుకు పడుతుంది.

రోమెల్ దవుడు

ఒక్క వారంలో బ్రిటిషు సైన్యం లిబియాలో 400 మైళ్ళు ముందుకు వచ్చింది. ఎల్ అలమెన్‌నుంచి టోబ్రూకుకు ఒక్క వారంలో బ్రిటిషు సైన్యం వచ్చేసింది. రోమెల్ సైనికులు తమ సామగ్రి పట్ల చూపిన విధానం అనుసరించడం తప్ప, కొంచమైనా ప్రతిఘటించడం లేదు. డార్నా బ్రిటిషువారి వశమైంది. లిబియాలో చాలా ముఖ్యమైన రేవు, బెంఘాజీ కూడా నాజీలు వదిలిపెట్టి వెనక్కి తగ్గారు.

బెంఘాజీనుండి కొంచెం దక్షిణంగా అంటివాట్ అనే ప్రదేశం వుంది. ఈ రెంటికీముఖ్యవున్న ప్రదేశాన్ని యేమైనా సరే నిలబెట్టాలని హిట్లరు హుకుం యిచ్చాడు.

ఈ ప్రదేశంలో కొన్ని రక్షణలు కూడా వున్నాయి కాని బ్రిటిషుఅష్టమ సైన్యం యీ రక్షణలు ఛేదించి ముందుకు పోయాయి.

రోమెల్ ఎక్కడ నిలబడతాడు?

రోమెల్ ప్రతిఘటించకుండానే పూర్తిగా లిబియాకు నీళ్ళు వదలి పోడు. బెంఘాజీకి దక్షిణంగా జెడాబ్యా, ఎల్ అగీలా అనే రేవులు వున్నాయి. ఈ అగీలావద్ద బలమైన రక్షణలు నాజీలు సమీకరించి వున్నారు. ఈ జెడాబ్యా-ఎల్-అగీలాల మధ్యే యిదివరకు రోమెలు నిలచి పోట్లాడాడు. ఇప్పుడుగూడా అదే వుద్దేశ్యము గావచ్చు. ఈ ఉద్దేశ్యంవల్లనే త్వరగా ఎల్-అగీలాకు చేరుకుని, అక్కడ రక్షణకు ఆయత్తపడివాడనే రోమెలు బెంఘాజీని ప్రతిఘటించకుండానే ఖాళీ చేసివుండవచ్చు

బ్రిటిషు సైన్యం యీ విషయం గ్రహించక పోలేదు. ఇట్టి పరిస్థితిని యెదుర్కొవాలనే అష్టమ సైన్యం డార్నానుంచి ఈశాన్యంగా మెకిలి అనే పట్టణం మీదుగా ఒక చీలికను చీసి ఎల్-అగీలాపై పంపింది.

బెంఘాజీ పడిపోవడంతోటే సైరినై అంతా బ్రిటిషువారి హస్తగతమైంది.

ట్యూనీషియలో - ఇరుకక్షలూ

ట్యూనీషియా ప్రాముఖ్యత క్రిందటివారంలో విశదీకరించబడింది. ట్యూనీషియాకు బిజెర్టా, ట్యూనిసు రేవులు ఆయువుపట్లు. హిట్లరు వీటిని నిలబెట్టుకోడానికి చివరివఱకు ప్రయత్నిస్తాడు. వీటిని గుంజుకోడానికి మిత్రమండలి ప్రయత్నిస్తుంది. రోజు, రోజుకూ మిత్రమండలి సైన్యాలు ఉత్తర ఆఫ్రికాలో వచ్చి పడుతున్నాయి. అల్జీరియా, మొరాకోలో ఉన్న అన్ని ఓడరేవులద్వారా మిత్రమండలి నౌకలు సైన్యాన్ని దింపుతున్నాయి. అంతేకాక ఈ తీరాన్నంతా మిత్రమండలి, ఫాసిస్టు పైమానికులదాడికి, సైన్యాల ఆక్రమణకు, దుర్భేద్యమయ్యేటట్లు రక్షణలను నిర్మిస్తున్నది.

హిట్లరు విమానాల నుండి టాంకులను, సైనికులను, ట్యూనిసులోనూ, తదితర చోట్లలోను దింపుతున్నాడు. ఇటాలియనులు నావలద్వారా ట్యూనీషియాకు వచ్చి చేరుతున్నారు.

మిత్రమండలి ఆశయాలు ముఖ్యంగాయివి ట్యూనీషియాలో అక్షరాజ్య సైన్యాలు వెనకకు పారిపోతున్న రోమెల్‌కు సహాయపడకుండా అడ్డుపడి, రోమెల్‌సైన్యాలను అడకత్తెరలో ఇరికించి నాశనం చేయడం; ట్యూనిస్, బిజెర్టా మొదలైన యితర ముఖ్యమైన రేవులను, పట్టుకుని, ఫాసిస్టులను తరిమివేయడం.

ఈ వ్యూహాన్ని సాధించడానికి మిత్రమండలి ఏమి చేస్తున్నది? బ్రిటిషు సైన్యాలు, "మొదటిదళం" బిజెర్టా, ట్యూనీసుల వైపు చొచ్చుకుపోతున్నాయి. అమెరికన్ సేనలు దక్షిణంగా పోయి గేబ్సు అనే రేవును పట్టుకుని, అక్కడనుండి ఉత్తరంగా, సముద్రతీరాన్నే పోయే రైలుమార్గాన్ని ఆక్రమించుకొని, స్ఫాక్సు అనేమరొక రేవునికూడా పట్టుకోడానికి ముందుకు పోతున్నాయి.

హిట్లరు విమానాలద్వారా కొంత సేనను ఈ గేబ్సురేవులో దింపాడు. ప్రతిఘటిస్తున్న స్థానిక ఫ్రెంచి సైన్యాలు దరిమి ఆరేవులోని ఒక టౌనుహాలు, సైనిక నివాసస్థలాన్ని ఆక్రమించుకున్నాయి.

మిత్రమండలి విమానాలు బిజెర్టాను, ట్యూనీసును, తీవ్రదాడికి గురిచేస్తున్నాయి. సిసిలీ రేవులనుంచి హిట్లరుకు సరకుల సరఫరా ఆపుచేయడానికి సిసిలీ రేవులపై బాంబులవర్షం కురిపిస్తున్నాయి. బ్రిటిషు వైమానికులు రెండు విమానాశ్రయాలను ఆక్రమించుకున్నారు. నాజీలకు ఎదురు తిరిగిన స్థానిక ఫ్రెంచి సేనలు, మిత్రమండలి సేనలు కలసి ట్యూనిసుకు పోయే ముఖ్య దాటలను పట్టుకొన్నాయి. బిజెర్టావద్ద భీకరమైన యుద్ధం జరుగుతున్నది మిత్రమండలి సేనలు బిజెర్టాకు 30 మైళ్ళలోనూ ట్యూనిసుకు 8 మైళ్ళలోనూ, ఉన్నారు. అటు దక్షిణాన, గేబ్సు, స్ఫాక్సు రేవులకు మధ్య ఉన్న రైలు మార్గం వీరి హస్తగతమైంది.

ఫ్రెంచి ప్రజలు, పాలకులు

ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యానికి పరమ శత్రువైన హిట్లరుకు మొన్న మొన్నటివరకూ జోహుకుం ఐన డార్లన్ ఫ్రెంచి ఆఫ్రికాకు హైకమీషనరుగా మాజు వెల్టు చేగుర్తించబడ్డాడు. దీనివలన ఇంగ్లండులోనూ, డిగాల్ పక్షంలోనూ అశాంతి అసంతృప్తి కలిగాయి. డిగాల్ డార్లానును గుర్తించనన్నాడు.

ఈ విధంగా పరిపాలకులలో అసంతృప్తి, భేదాభిప్రాయాలు కలుగుతున్నా, ఉత్తర ఆఫ్రికాలోని ప్రజలు మిత్రమండలికి సహాయం, సానుభూతి చూపిస్తున్నారు. కాని, ఈ సానుభూతి పూర్తి సహకారంలోకి మారాలంటే డిగాల్ మొదలగువారు ఉత్తర ఆఫ్రికాలోని మొరాకో, మొదలగు జాతులకు స్వాతంత్ర్యాన్ని, స్వయం నిర్ణయాధికార హక్కును, ప్రకటించాలి. "పశ్చిమ ప్రపంచానికి చెందిన సామ్రాజ్యాన్ని తోసి, ప్రాక్ప్రపంచానికి చెందిన సామ్రాజ్యాన్ని స్థాపించడం చైనా ఆశయం గాదు. ఎక్కడ ప్రపంచంతో వేరుగా ఉండిపోవటం కూడా చైనా ఆశయంగాదు" అని చెప్పిన ఛంగ్-కై-షేక్ మాటలు వీరు గమనించాలి.

శీతాకాలం దాడి

హిట్లరుకు మూడు ఆశాభంగాలు: ఒకటి, స్టాలిన్‌గ్రాడును వశపరచుకొని, వెనకగా వెళ్ళి మాస్కోను పట్టుకోవాలనుకున్నాడు. కాని అది జరగ లేదు. రెండు, మొదటిది నెరవేరకపోయినా, స్టాలిన్‌గ్రాడును పట్టుకొని శీతాకాలపు విశ్రమ స్థానంగా చేసికోవాలనుకున్నాడు. అదీ ఇంత వఱకు జరగలేదు. జరిగే సూచనలు లేవు. మూడు: ఇంకా సరిగా శీతాకాలం రాకముందే సోవియట్ శీతకాలపు దాడి ప్రారంభమైంది.

మూడు రోజులలోనే 50 మైళ్ళు ముందుకు పోయారు రష్యనులు.

స్టాలిన్‌గ్రాడుకు దక్షిణంగాను, వాయువ్యంగాను, రష్యనుల శీతాకాలపు దాడి ప్రారంభమైంది. డానునది తూర్పుగట్టునఉన్న కలాచ్ వీరి హస్తగతమైంది. క్రివిన్‌స్కాయాసావ్ట్‌స్కా అనే స్టేషను, ఎచ్‌గనిరావ్ అనే స్టేషను రష్యనులు ఆక్రమించుకున్నారు. ఈ స్టేషనుల ఆక్రమణ మూలాన, డాన్‌కు తూర్పు ఒడ్డున ఉన్న శత్రుసైన్యాలకు సప్లయి చేసే రెండు రైలు మార్గాలూ బందు ఐనవి. అంతేగాదు, అప్పుడే 14,000 నాజీ సైన్యం నిహతమయినట్లు మాస్కో ప్రకటన చెప్తున్నది. 13వేల జర్మనులను ఖైదీలుగా పట్టుకొన్నారు. స్టాలిన్‌గ్రాడ్‌కు వాయువ్యదిక్కున 5 వేలు జర్మనులు ఖైదీలుగా చిక్కారు.

నొవొరొసీస్కు, ట్యాప్సె, నాల్‌చిక్ పట్టణాలనుంచీ, కాల్‌మక్ పచ్చిక బయళ్ళనుంచీ సోవియటు ఎదురుదాడి విజృంభించింది.

నాజీల వెన్నెముక విరుగుతుంది

ఈ దాడి విరామం లేకుండా, నాజీలు ఊపిరైనాపీల్చటానికి వీలులేకుండా, సాగుతుంది. ఈ దాడి ముర్మాన్స్కునుంచి నాల్చిక్ వఱకూ వ్యాపిస్తుంది. విషీ రేడియో యే ఈ దాడిని ఈ విధంగా వర్ణించింది. "ఏడు పెద్ద సైనిక దళాలు లెనిన్‌గ్రాడు వఱకు ఉన్న రంగంలో సమీకరించబడి ఉన్నాయి."

క్రిందటి శీతాకాలంలో రష్యను ప్రతిదాడి పడమరకు 300 మైళ్ళు దూరంకన్న ముందుకు పోలేకపోయింది. కాని ఇప్పుడు పరిస్థితులు వేఱు. ఈ దాడికి రెండు ముఖ్య విషయాలు అనుకూలంగాఉన్నాయి ఒకటి ఉత్తర మధ్య రంగాల్లో ఉన్న రష్యను సైన్యం ఇంచుమించు అంటా, మంచి స్థితిలోనే ఉన్నాయి. ఇది వఱకు నాజీలు 1500 మైళ్ళ రంగంలో పోట్లాడి, అన్ని రష్యను దళాలకు పని కల్పించారు. కాని ఈసారి నాజీలు చాలా తక్కువగా వ్యాపించిన రంగంలోనే యుద్ధంచేశారు. ఈ కారణంవల్ల దాదాపు మూడు పాళ్ళలో రెండు భాగాలు రెడ్ ఆర్మీ యుద్ధంలో పాల్గొనలేదు. ఆ సైన్యమంతా యుద్ధానికి తయారుగా ఉంది. రెండు యుద్ధంలో ఈ సంవత్సరం మిత్రమండలి అభివృద్ధి దశలో ఉన్నది.

ఫాసిస్టులు పతనం పొందాలంటే

ఆఫ్రికాలోని విజయాలు, రష్యను శీతాకాలపు దాడి తాపులు హిట్లరు గాంగును బలహీన పరుస్తాయి. దీనితోపాటు ఆక్రమిత దేశాలలో ప్రజా విజృంభణలు రోజురోజుకూ మించి పోతాయి. అప్పుడే క్రోషియావో జలమైన విప్లవం ప్రారంభమైంది. ఈ విప్లవం యూగోస్లావియా గెరిల్లా సైన్యాల బలాన్ని వృద్ధి చేస్తుంది. ఇటలీలో టూరిన్, జినోవా, మిలాన్ పట్టణాలలో 3000 మంది అరెస్టు అయారు. ఇందులో మిలిటరీ ఉద్యోగులు, పారిశ్రామికులు, ఫాసిస్టు పార్టీకి చెందిన అధికారులు ఉన్నారని మాస్కో రేడియో ప్రకటించింది. కార్సికాలో నాజీలను తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు.

అన్ని విధాల ఫాసిస్టులు దెబ్బతింటున్నారు ఈ సమయంలో, వెంటనే, యూరపులో రెండవ రంగం తెరవాలి దాంతో హిట్లరుకు చావు దెబ్బ తగుల్తుంది. — 24-11-42

హిందూ-ముస్లింఏక్ హో!

కామ్రేడ్
నండూరి ప్రసాదరావు

నిజమైన ఫాసిస్టు వ్యతిరేక పోరాటం, స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమైంది. అదే కమ్యూనిస్టుపార్టీ అధ్వర్యాన నవంబరు 1 వ తేదీన ప్రారంభమైన జాతీయైక్యతా వుద్యమం.

ఇంతవరకూ వచ్చిన రిపోర్టులబట్టి జాతీయైక్యతావారం దిగ్విజయంగా జరిగింది. క్లుప్తంగాచెప్పాలంటే, దేశంలో ప్రతిఒక్కడూ కోరుకున్న జాతీయైక్యతకు పునాదులు వేయబడ్డాయి. జాతి మత వివక్షతలు లేకుండా, పార్టీలు కక్షలతో సంబంధంలేకుండా వందలు వేలు కమ్యూనిస్టుపార్టీ నినాదాన్ని బలపర్చారు. వేలు, లక్షలు పార్టీ సందేశాన్ని ఆలకించారు.

ఈ అవ్యక్త మధురగానాలాపంలో అపస్వరాలు లేకపోలేదు; ఉద్యమ ప్రవాహంలో అక్కడక్కడ ఎదురుదెబ్బలు తగలకపోలేదు. ఫార్వర్డుబ్లాకు వ్యతిరేకించింది. రాయిస్టులు అవహేళన చేశారు; ప్రభుత్వం ఆటంకాలను కల్పించింది. కొంతమంది దేశభక్తులు మూతిని విరిచారు. అయినా అన్ని అభ్యంతరాలను గమనిస్తూ, అన్ని ప్రతిఘటనలను జయిస్తూ ఉద్యమం ముందుకు సాగుతూనే ఉన్నది.

ఈ ఐక్యతా పోరాటంలో పార్టీ తుపాకి గుండ్లవంటి ప్రశ్న పరంపరలకు గురియైంది. 'ఒక్క యింట్లోనే ఐక్యతవుండ నప్పుడు దేశమంతటా ఐక్యత ఏమి ఏర్పడుతుంది? సంతకాలు చేయించటం మితవాదుల ధోరణికాదా? ప్రభుత్వమే లేనిది ఏ ప్రభుత్వానికి ఈ అర్జీలు?' అన్న ప్రశ్నలు సహజంగా కల్గే సందేహాలే; కాని "కమ్యూనిస్టులు గవర్నమెంటు ఏజంట్లుటగా? ఇప్పుడు నిశానీలు పెట్టించి తర్వాత సైన్యంలోకి లాక్కుపోతారటగా? ఎస్టేట్లలో శిస్తుల సత్యాగ్రహం ప్రారంభిస్తే యుద్ధ వ్యతిరేక మెట్లాగు అవుతుంది." అన్న ప్రశ్నలు స్పష్టంగా ఫార్వర్డుబ్లాకు దుష్ప్రచారాన్ని తెలియజేస్తాయి. కాని పార్టీ సభ్యు లిచ్చిన సమాధానాలతో సందేహాలన్నీ నివృత్తిఅయినాయి; దుష్ప్రచారమంతా పటాపంచలైంది. పార్టీ సభ్యుల త్యాగాలు ఎట్లా పార్టీకి దబ్బువస్తోందో ప్రజలకు స్పష్టంజేసినాయి.

వివిధరంగాలలో వుద్యమం

కార్మికులలో:—బొంబాయి, అహమ్మదాబాదు, కాన్పూరు మొ॥ పారిశ్రామిక కేంద్రాలు ఆంధ్రదేశంలో లేవు; కరాచీ, కలకత్తాలవంటి వాణిజ్య కేంద్రాలూ తక్కువే. ఉన్న కేంద్రాలవి విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, బెజవాడ, గుంటూరులున్ను రైల్వే మాత్రమున్ను చెప్పుకోతగ్గవి. ఈప్రదేశాలన్నిటిలోను ఐక్యతా వుద్యమం జయప్రదంగా సాగింది.

విశాఖపట్నంలో కామ్రేడ్స్ 5 జట్లుగా ఏర్పడ్డారు. ఒక ప్రోగ్రాముకు వేసుకున్నారు ఆ ప్రకారం 10 గ్రామాలు తిరిగారు. శ్రీహరిపురం, మల్కాపురం, గుల్లలపాలెం, రామమూర్తిపేట, గొరకంచరపాలెం, రెడ్డికంచరపాలెం మొ॥ వాటిలో సుమారు 300 మంది కార్మికులతోను సన్నిహిత సంబంధం ఏర్పడింది. వారి సందేహాలకు సమాధానాలు ఇవ్వబడ్డవి. 167 సంతకాలు పెట్టబడ్డాయి. పార్టీఫండు టిక్కెట్లు 170 అమ్మబడ్డాయి. పార్టీ పాలసీని అంగీకరించారనటానికి తార్కాణం, క్రొత్తగా ప్రజాశక్తికి 10 మంది చందాదార్లు జేరటం, 70 మంది కార్మికసంఘంలో సభ్యులుగా జేరటం. విజయనగరంలోకూడా కార్మికులుండే పేటలలో ప్రతిదినం సభలుజరుపబడుతూవుండేవి. జాతీయైక్యతతో జపాన్ను ఎలా ఎదుర్కోవలసింది, కాంగ్రెసునాయకుల విడుదల, ప్రజారక్షణ సంఘాలు, ధరల కంట్రోలు, గెరిల్లా పద్ధతులనుగూర్చి తెలుపబడింది. 8 రోజులూ, జాతీయైక్యతాదినం, నిర్బంధవ్యతిరేకదినం, సోవియట్‌యూనియన్ దినం, చైనాదినం, ఫాసిస్టు వ్యతిరేకదినం, రష్యా విప్లవదినోత్సవం, అధికలాభాల నిరసన దినంగా జరుపబడ్డాయి. అన్ని సభలకు సుమారు 6150 మంది ప్రజలు హాజరయ్యారు. రు 80/-లు పార్టీఫండుకు వసూలుజేసి 'ఇంకా ఎక్కువ ప్రోగుచేయుటకు బోల్షివిక్ పట్టుదలతో పనిజేస్తున్నాము' అని రిపోర్టు పంపుతున్నారు.

రాజమండ్రి రైల్వే కార్మికులలో కొందరికి ఫార్వర్డు బ్లాకు ప్రచారపు గాలి సోకినట్లున్నది. వారి సందేహాలు యివి. బోసుబాబు సోషలిస్టు గదా, జపాను మనకు స్వరాజ్యం యిస్తుంది గదా: ఈ సందేహాలకు వారి తోటికార్మికులే "చీనాకు స్వరాజ్యం ఎంత ఇచ్చిందో, మనకూ అంతేయిస్తుంది స్వతంత్రం యివ్వటానికికాదు, స్వంతం జేసుకుంటానికి వస్తోంది" అనిచక్కటి జవాబుచెప్పారు. సందేహాలు నివృత్తిచేసుకొని సంతకాలు పెట్టారు. ఒక చదువుకున్న క్రిస్టియన్‌కార్మిక సోదరుడు అప్పీలుమీద సంతకం పెట్టవచ్చునో, లేదో' అని తటపటాయిస్తుంటే పక్కనే వున్న వాచ్ అండ్ వార్డు సిపాయి గబగబా వచ్చి 'ఆలోచనెందుకయ్యా కాంగ్రెసు నాయకుల్ని విడిపించమంటానికి' అని తాను సంతకం పెట్టాడు. మన కామ్రేడు ఆ సోదరుడికి యిలా చెప్పారు. "నేడు ఫాసిస్టు దండయాత్రనుండి దేశాన్ని రక్షించడం ప్రధానం. అందుకు జాతీయ ప్రభుత్వం వుండాలి. కాంగ్రెసు లేనిదే జాతీయప్రభుత్వం సాధ్యపడదు. కాబట్టి వారి విడుదలను కోరుతున్నాం" అని. ఈ వాదన ఆయనకు నచ్చి సంతకం పెట్టి వెళ్ళాడు. ఈ వుద్యమ ప్రచార ఫలితంగా అనేక కార్మికులతో పార్టీకి సంబంధం కల్గింది. పీపుల్సువార్‌కు 6 గురను, ప్రజాశక్తికి 9 గురను, ఖామీ జంగుకు ఇద్దరు కొత్త చందాదార్లను కార్మికులలో చేర్పించగల్గారు. ఈ పట్టణంలో తోళ్ళ కార్మికులు, పాకీ పనివారలలో గూడా ఐక్యతా ప్రచారం చేయబడింది. టౌను కమిటీ అచ్చువేయించిన ప్రత్యేక జండాలు 500 అమ్మబడ్డాయి. 400 మంది విజ్ఞప్తులపై సంతకాలు పెట్టారు.

చిట్టివలసలో ఒక యిబ్బంది కలిగింది. బ్లాకౌట్ నిబంధనలవల్ల రాత్రిళ్ళు దీపాలు వుండేవికావు. కాబట్టి మధ్యాహ్నం వుండే ½ గంట విశ్రాంతి సమయంలోనూ సంతకాలు పెట్టించేవారు; మీటింగులు పెట్టేవారు. కాంగ్రెసు నాయకుల విడుదల నెంతమంది కోరుతున్నారు అని అడగగానే వారి అభిమానంకొద్దీ కార్మికులు రెండు చేతులూ యెత్తేవారు. సమ్మెలలో కార్మికులలో వుండవలసిన ఐక్యతను గూర్చి బాగా అనుభవం గల వీరు జాతీయైక్యత యొక్క ప్రాముఖ్యతనుగూర్చి తెలుసుకొనుట కష్టంకాలేదు. స్త్రీలూ, పురుషులూ, అందరూ కలిసి 1207 మంది సంతకాలుపెట్టారు.

జంషెడ్‌పూరు ఆంధ్రదేశంలోనిది కాకపోయినా, ఆంధ్ర కార్మికులు అధికంగా వున్న బస్తీ. అచ్చటి కార్మికులలో కూడా ఐక్యతా వుద్యమం చురుకుగా సాగింది. ఇచ్చటకూడా కొన్ని విఘ్నాలు సంభవించినాయి. రాయిస్టులు మితవాద కార్మిక నాయకులు కాంగ్రెసు వ్యతిరేక ప్రచారాన్ని తీవ్రంగా గావించారు; గోడమీద ప్రకటన పత్రాలు కూడా అంటించారు. అయినప్పటికీ మైళ్ళ పర్యంతం విస్తరించియున్న యీ కార్మిక జనావాసంలో, పార్టీ సభ్యులు బోల్షివిక్కు పట్టుదలతో, ఒకపూట భోజనాలు మాత్రమే చేస్తూ, తిరిగి, 1700 మందిచే సంతకాలు చేయించారు.' పార్టీ నినాదాలు వినగానే, కార్మికులందరూ ముఖ్యంగా బీహారీలు, పంజాబీలు, యెఱ్ఱజెండా చుట్టూ మూగేవారు. ముస్లిములలో ఎక్కువ్మందమైన కదలిక కల్గింది. "ఐక్యత కుదిరిన మరు క్షణము మనకు స్వాతంత్ర్యం రాదా?" అని ప్రతివారూ రిమార్కు చేసేవారు.

గ్రామాలలో:- అన్ని జిల్లాలలోను, అనేక గ్రామాలలో ఐక్యతా ప్రచారం చేయబడింది. సాధారణంగా ఆంధ్ర రైతాంగం కాంగ్రెసు అభిమానం గలది; కాంగ్రెసు పేరిట నేడు జరుపబడే ఉద్యమం వారిని కదిలించింది. కాని క్రమక్రమంగా వారు యీ విధ్వంసకచర్యల వల్ల స్వాతంత్ర్యం రాదు సరిగదా, ప్రభుత్వ నిర్బంధ విధానం బలపడుతుందని తెలిసికొంటున్నారు ఈ ఐక్యతావారంలో పార్టీ సభ్యులు చేసిన ప్రచార ఫలితంగా యీ సత్యాన్ని గ్రామస్థులు స్పష్టంగా తెలుసుకోగల్గుతున్నారు. ముఖ్యంగా జాతీయైక్యతవల్లనే దేశాన్ని రక్షించుకోగలమనీ, స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోగలమనీ గుర్తించుతున్నారు. ఇదివరకు కాంగ్రెసు అభిమానం యెక్కువగాగల శీతానగరం (తూ.గో) వంటి గ్రామంలో నేడు జరిగే "పోరాటం"తో తమకేమీ సంబంధం లేదంటున్నారు. పార్టీ వ్యతిరేకులూ, విధ్వంసకచర్యల వల్లనే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మే గుడ్డి దేశభక్తులూ గ్రామాలలోనే యెక్కువగా పార్టీనిగూర్చి వ్యతిరేక ప్రచారం జేశారు. ఐక్యతా వుద్యమంవల్ల యిట్టి దుష్ప్రచారమంతా నిష్ప్రయోజనం చేయబడ్డది.

ఐక్యతా వుద్యమం ద్వారా ప్రజా ఉద్యమం ముందుకు పోయిందనటానికి ఉదాహరణలు చౌకధరల డిపోలు తెరిపించబడటం, ప్రజారక్షణ దళాలు ఏర్పడటం, విమాన దాడిరక్షణ దళాలు ఏర్పడటం. నెల్లూరుజిల్లా గూడూరు, వెంకటగిరి, నెల్లూరు గ్రామ్యాలలో రైతులు వ్యవసాయ కూలీలు, మైకాగనుల కూలీలు, అందరూకలిసి చౌకధరల డిపోలు తెరిపించమని అధికారుల్ని కోరారు. ఈ మూడుచోట్ల ఈ డిపోలు తెరవబడ్డాయి. ఇట్టివే ఇతరచోట్ల కూడా తెరిపించుటకుగానుగ్రామస్థులంతా, జాతి, మత వివక్షతలు లేకుండా, కలిసి ఆందోళన జేస్తున్నారు. నిడమర్రు (ప॥ గో॥)లో 18గురు యువకులు, 2 రు యువతులు కలిసి ప్రజారక్షణ దళంగా ఏర్పడ్డారు. నాయుడుగూడెం, యండగండి (ప॥గో॥) గ్రామాలలోనూ, బెజవాడ, భట్లపెనుమర్రు (కృ॥జి॥) గ్రామాలలోనూ విమాన దాడి రక్షణ దళాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా జాతీయైక్యత గ్రామాలలో నిరూపింపబడుతోంది.

పార్టీ ఫండు వసూళ్ళుకూడా జాతీయైక్యతా నినాదం ఏవిధంగా ప్రజలందరిచేతా అంగీకరించబడుతోందో తెలియజేస్తుంది. నెల్లూరు జిల్లాలో ఇందుపూరులో ధనికరైతులు రు 9 బీదరైతులు, చిన్న వ్యాపారస్థులు, కూలీలు 18-5-9 లు ఇచ్చారు, తలమంచిలో ధనిక రైతులు 10-0-0 లు బీదరైతులు, చేనేత పారిశ్రామికులు, చిన్నవ్యాపారస్థులు రు 21 లు ఇచ్చారు. అల్లూరులో ధనికరైతులు రు 19 లు బీదరైతులు, చిన్నవ్యాపారస్థులు, గుమాస్తాలు రు 22-5-0 లు ఇచ్చారు. చిత్తూరు జిల్లా మదనపల్లి, పుంగనూరు తాలూకాలలో పార్టీ సభ్యుడు అమ్మిన 73 పార్టీఫండు టిక్కెట్లలోను 31 బీదరైతులు, 11 విద్యార్థులు, 3 యువకులు 10 చిల్లర దుకాణదార్లు, 2 ఉపాధ్యాయులు, 1 కూలి, 15 చేతిపనులవారుకొన్నారు.

బెజవాడ తాలూకా ఒక ఫిర్కాలో రైతులలో 210, పెద్ద రైతులలో 0, ...లలో 20, కూలీలలో 59, స్త్రీలలో 4 ...పంపు టిక్కెట్లు అమ్మారు. ప్రజాశక్తికి ... పీపుల్సువార్ 5 ఖామీజంగ్‌కు 2 లోకయుద్ధ 1 చందాదార్లను జేర్పించారు.

ముస్లింలలో

ముస్లిములనుగూర్చి మిక్కిలి ప్రోత్సాహకరమైనటువంటి వార్తలు వస్తున్నాయి. ...నికి ముస్లిం ప్రజాసామాన్యాన్ని రాజకీయం చైతన్యం పొందించుటకు ఆంధ్రలో ఏ ప్రయత్నమూ... యున్నా ఇంతవరకు తీవ్రప్రయత్నాలు చేయలేదు. ఈ జాతీయైక్యతా వారంలోనే మొదటగా ముస్లిము జనబాహుళ్యాన్ని కలుసుకోవటం సంభవించింది; వారి మనోభావాలను సరిగా గ్రహించటం జరిగింది.

ప్రజాసంఘాలద్వారా ఇదివరకే పార్టీ... కొంతవరకు ముస్లిములతో పరిచయమున్నది. అందుచేతనే నెల్లూరుజిల్లా గూడూరులో ... బీద ముస్లిం సోదరుడు, కామ్రేడు దగ్గరకు రాగానే, "కమ్యూనిస్టుపార్టీ బీదలపార్టీ ... నాకు తెలుసు; మీరు హెచ్చుగా చెప్పనక్కరలేదు" అంటూ నాల్గణాల పార్టీ సాహిత్యం కొన్నాడు. ఆజిల్లాలో ముహమ్మదీయు... కొందరు పార్టీ ఉర్దూ పత్రికయగు, ఖౌమీ జంగ్‌ను చదువుతున్నారు. వీరందరూ పార్టీ నినాదాలను అంగీకరించారు; జాతీయైక్య... అవుసరాన్ని గుర్తించారు. రాజమండ్రి ముస్లిం విద్యార్థులుకూడా ఐక్యతాప్రచారానికి బాగా సహాయంజేశారు. పార్టీ నినాదాలన్నింటిని అంగీకరించారు. గుంటూరుజిల్లా దొంపిచర్ల, గుడిపాడు, చేజర్ల గ్రామాలలో ముస్లిములు సభలకు హాజరౌతూ, మహజర్లపై సంతకాలు చేశారు. గుంటూరులో చాలామంది ముస్లింలు పార్టీ పాలసీని అంగీకరించారు.

సామాన్యంగా ముస్లిములకు ఒకసందేహం ఉండేది. పార్టీచెప్పే జాతీయ స్వయంనిర్ణయ సూత్రానికి హిందువులు అంగీకరిస్తారా అనే వారిసందేహం. ముస్లిములు హిందువులు ఎక్కువగా కలిసిపోయివుండే ఆంధ్రదేశంలో ముస్లిములు తమ జాతి యభివృద్ధిని ఎం... గాఢంగా కోరుతున్నారో ఈ విషయం తెలియజేస్తుంది. పార్టీ నినాదాలను అంగీకరించిన ముస్లిములు కూడా కొంతమంది మహజర్లపై సంతకాలు చేస్తానికి జంకారు; కొంతమంది ... చెయ్యలేదుకూడాను, మరి కొంతమంది తా... స్వయంగా లీగునాయకులకు ఈ మహజర్ల విషయాలను తెలియజేస్తామన్నారు. ఏమి కారణం? ముస్లింలీగు ఏమీసూచన ఈయ... తాము స్వతంత్రించిసంతకాలుచేయటానికి వీ... సంకోచంవుంది. ఇందువల్లలీగుఅంటే ముస్లిములలో ఎట్టి గాఢాభిమానము ఉన్నదో, తమ... ఉద్ధరణ లీగు ద్వారానే సాధ్యమౌతుం... ఎంతగా వారు విశ్వసిస్తున్నారో తెలుస్తుం... దేశాన్నిరక్షించటానికివారుసంసిద్ధులే; కాంగ్రెసు నాయకుల విడుదలను వారూ కోరుతున్నవా... జాతీయైక్యతయే తమయొక్క, దేశంయొక్క రక్షణను సమకూర్చగలదని తెలుసుకున్నా... వారు కోరుతున్న జాతీయ స్వయంనిర్ణయ సూత్రమే గనుక అంగీకరించబడితే సంపూర్ణమైన జాతీయైక్యతనిర్మించడానికి ఏమీ అడ్డు... ఉండదు.

ఐక్యతా ఉద్యమ విజయం

ఇటీవల రాజకీయాలలో గల్గిన మార్పుల వల్ల ఎక్కువగా ఉద్రేకం పొందినది విద్యార్థులు. ఇదివరకు రాజకీయాల వాసనలేనట్టి వారుకూడా ఈ ప్రవాహంలోకి ఈడ్వబడ్డారు. ముఖ్యంగా హైస్కూలు విద్యార్థులలో బాగా చలనం కలిగింది. చాలాచోట్ల కమ్యూనిస్టుల పంథా వీరికి రుచించలేదు. ఉద్రేకపూరితులైన వారు, స్వాతంత్ర్యానికిమార్గం సుగమం కాదని గుర్తించలేదు; వారికి కావలసినదల్లా కుప్పిగంతుతో దాటగల్గిన దగ్గరమార్గం. విధ్వంసక చర్యలవల్లనే ప్రభుత్వాన్ని స్థంభింపజేయవచ్చు ననుకొన్నారు. . కాని వారు తమ తప్పిదాన్ని క్రమంగా గుర్తిస్తూ వచ్చారు; పార్టీ ఐక్యతా నినాదాన్ని వారు అంగీకరించసాగారు; ఐక్యతా వారం త్వరగా ఈ పరిణామం పూర్తిజేయుటకు సహాయభూతమైంది.

విశాఖపట్నంలో

విద్యార్థులలో ప్రచారం చేయటానికిగాను 3 దళాలు బయలుదేరాయి. వారి కృషినిగూర్చి తెల్పటానికి మొదటిదళంయొక్క రిపోర్టులోని ఒక పేరానుమాత్రం ఇచ్చట ఉదహరిస్తాను. "1 వ తేదీన మేము 'కె' లాడ్జిలో సంభాషణలు మొదలుపెట్టాము. అంతకుముందు ఈ లాడ్జిలోనివారు కొంతవరకు పార్టీ సానుభూతి పరులైనా, ఉద్యమంవచ్చినతర్వాత చాల వ్యతిరేకులయ్యారు. కాని యింతకుముందే కొంత చర్చ జరుగుటవల్ల కొంత మారారు. నెమ్మదిగా మన పత్రికను చదువుతూవచ్చారు. వీరికి అంతర్జాతీయ ప్రజాశక్తిలో నమ్మకంలేదు. కొంతవరకు ఎనలిటికల్‌గా జెప్పిన తర్వాత ఈ మధ్యజరిగిన విషయాలన్నీ చూపిస్తూ, జాతీయైక్యత ఏవిధంగా దేశాన్ని అన్నివిధాల రక్షిస్తుందో చెప్పినతర్వాత మన పాలసీని అంగీకరించారు. పార్టీఫండు యివ్వమనగానే 5 గురు తలా రెండురూపాయీలు, ఒకతను ఒక్క రూపాయి చందా వేశారు. మొత్తం ఈ లాడ్జిలో 6 గురతో సంబంధం ఏర్పడింది. 11 రూ.లు వేశారు. 2 వ తేదీన 'సి' లాడ్జికి వేళ్ళాము. వాళ్ళకు రాజకీయాలు బొత్తిగా తెలియవు. మేమేగాకుండా పట్టణకమిటీ కార్యదర్శిని కూడ తీసికొని వెళ్ళాము. వారిలో ముగ్గురు సంతకాలు పెట్టారు. ఒకతను రెండు రూపాయీలు చందాయిచ్చాడు. ఇంకొకాయన ఒక టిక్కెట్టునుకొన్నాడు. తతిమ్మా ముగ్గురు మన పాలసీని అప్రిషియేటు చేశామన్నారు గాని సంతకాలు పెట్టుటకు భయపడ్డారు. మొత్తం ఈ లాడ్జిలో వున్న 9 మంది మన పాలసీని ఒప్పుకున్నారు."

రాజమండ్రిలో

ఈ ఐక్యతావుద్యమ ప్రచారంవల్ల విద్యార్థులలో చలనం కల్గిందని చెప్పవచ్చు. కొన్ని దళాలుగా పార్టీ సభ్యులు బయలుదేరి జాతీయైక్యత ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ సంతకాలు చేయించారు. కొద్దిమంది తప్ప, కలుసుకున్న వారంతా పార్టీ పాలసీని అంగీకరించారు. పైన తెల్పినట్లుగా యీ వుద్యమం ముస్లిం విద్యార్థులలో మరీ చలనంకల్గించింది. వారంతా సంతకాలు చేశారు. ముస్లిం విద్యార్థిసంఘాన్ని పెట్టుకుంటానికి తీర్మానించుకున్నారు.

రామచంద్రపురం, కాకినాడ

విద్యార్థులలోకూడా జయప్రదంగాజరుపబడింది.

గుంటూరులో

బహిరంగ సభలు జరుపుకుంటానికి అనుమతి యీయబడలేదు. కొబట్టి హాలంతా విద్యార్థుల బసలలో కొన్ని సభలు జరుపబడ్డాయి, 6, 7, 8 తేదీలలో మాత్రము అనుమతి యీయబడుటచే బహిరంగ సభలు జరుపబడ్డాయి. 7 వ దినమున 50 మంది విద్యార్థులు పార్టీనినాదము లను కల్గిన అట్టలతో పట్టణమంతా సైకిళ్ళపై ప్రదర్శనము జరిపారు. పాకిస్థాన్: జాతీయ స్వయం నిర్ణయ హక్కుమీద విద్యార్థుల కొరకు క్లాసు యేర్పాటుచేయబడింది. వివాదం చేసే కొద్దిమంది మినహా, హాజరైన అందరూ పార్టీ నినాదాన్ని పూర్తిగా అంగీకరించారు. ముస్లిం విద్యార్థి కామ్రేడ్సు యెక్కువగా పట్టణంలో ముస్లింప్రదేశాలలోతిరిగి ప్రచారం గావించారు.

ఐక్యతా వారంలో సంతకాలతో బాటు హక్కులకొరకు కూడా ప్రచారం సాగింది. కాగితపు కరువును గూర్చి విద్యార్థి కామ్రేడ్సు ప్రిన్సిపాలుకు తెలియజేసి, కంట్రోలు రేట్లకు అమ్మటకై అంగడిని తెరిపించ కోరారు. ప్రిన్సిపాలు అంగీకరించి వెంటనే ఒక అంగడిని యేర్పాటుచేయించాడు. డిటెన్షనులు రద్దు కావాలని కూడా కామ్రేడ్సు విద్యార్థులలో ప్రచారం సాగించారు. ఇందుచే విద్యార్థులలో ఆంధ్రవిద్యార్థి ఫెడరేషనంటే గాఢ అభిమానం యేర్పడింది. నేషనల్ స్టూడెంట్సు యూనియనును యేర్పాటుచేయించ ప్రయత్నించేవారి ఆటలు సాగటంలేదు.

మదనపల్లెలో

విద్యార్థులు యీ వారంలో ప్రచార ఫలితముగా జాతీయైక్యత అవుసరాన్ని గుర్తిస్తున్నారు. కాంగ్రెసు వుద్యమంలో నాయకుడిగా ఉండిన ఒక విద్యార్థి దేశభక్తుడు యిలా అన్నాడు: "అరాజకోద్యమాన్ని నడిపించుచున్న నాయకులంతా పొరపడుతున్నారని యిప్పుడు తెలుస్తున్నది. దేశంలో అల్లకల్లోలా లుంటే జపాను విజయానికి దారి తీసినట్లే"అని పార్టీ పాలసీని గూర్చి చెప్పగా అతను వెంటనే ప్రజాశక్తి చందాదారుడైనాడు. ఒక కాలేజీ లెక్చరర్ ఐక్యతా ఉద్యమాన్ని అభినందిస్తూ కమ్యూనిస్టు పార్టీకి అభిమానాన్ని చూపిస్తూ ఒక రూపాయి చందా యిచ్చాడు. ప్రస్తుత కాంగ్రెసు ఉద్యమాన్ని బలపరుస్తూ వుండే మరొక విద్యార్థి దేశభక్తుడు "కమ్యూనిస్టుల పాలసీయే సరియైనది" అన్నాడు. ఎంతో వుత్సాహంతో తానుకూడా విద్యార్థులలో ప్రచారము జేయుటకై కొన్ని మహజరు ఫారాలను తీసుకున్నాడు.

కాంగ్రెసు వాదులలో

"కమ్యూనిస్టులు ప్రభుత్వంతో కలిసిపోయారు"అని కాంగ్రెసు నాయకులు దుష్ప్రచారము విపరీతంగా సాగించారు. ఈ ప్రవాహంలో పడ్డ కాంగ్రెసు వర్కర్లు కూడా "కమ్యూనిస్టులు మంచి వర్కర్లే; యిదివరకు తీవ్ర విప్లవ మార్గాన్ని చూపించినవారే; కాని యిప్పుడు వారు విప్లవ వ్యతిరేకులైనారు. వారు వుద్యమానికి నాయకత్వం వహిస్తే పూర్తిగా జయప్రదం అయ్యేది" అని భావిస్తూ వచ్చారు. ఇటువంటి వాతావరణంలో కూడా పార్టీ యేటికెదురీది కొంతవరకు జయాన్ని పొందింది. ఈ ఐక్యతా వుద్యమంవల్ల, యిట్టి కాంగ్రెసు వర్కర్లలో గల దురభిప్రాయాలు పోయి, క్రమ క్రమంగా పార్టీ పంథాను వారు అంగీకరిస్తూ రాసాగారు. ఐక్యతనుగూర్చి వీరికి గల సందేహాలు కూడా చాలావరకు తీరినాయి.

నాయకులు మాత్రం పార్టీపై తమకు గల అక్కసునంతా వెళ్ళబోసుకున్నారు. విజయనగరంలో పార్టీ అంటించిన వాల్ పోస్టర్లపై పార్టీని దూషిస్తూ, జిల్లా కాంగ్రెసు సంఘం వారు కాగితాలను అంటించారు. ఖూనీ తప్ప, మరేపనైనా అహింసయేనని కూడా కరపత్రాలను వేయించారు. పెనుమంట్ర, అత్తిలి ఫిర్కాలలో (ప. గో.) ఛోటా కాంగ్రెసు నాయకులు కొంతమంది తీవ్రంగా వ్యతిరేకించారు. వీరికి నేత బోసునాబు భారత దేశం పాలిట ఆర్తత్రాయపరాయణుడైనాడు. కృష్ణాజిల్లాలో ఒక నాయకమ్మన్యుడు 'బొంబాయిలో కమ్యూనిస్టు పార్టీ సెంట్రలు ఆఫీసు తగలబడింది" అని అబద్ధాలు చెప్పుటకు కూడా వెనుదీయలేదు. నెల్లూరులోనూ, గూడూరు తాలూకాలోను కాంగ్రెసు నాయకులు హిందూ మహా సభవారు కూడా పార్టీకి తీవ్రంగా వ్యతిరేక ప్రచారం జేశారు.

కాని నాయకులు కొంతమందివ్యతిరేకించినా కాంగ్రెసు వర్కర్లతో ఐక్యతాఉద్యమం మంచి ప్రభావాన్ని చూపెట్టింది. విశాఖపట్టణంజిల్లాలో పార్టీసభ్యులను ప్రశ్నలతో ముంచెత్తిన 6 గురు కాంగ్రెసు వాదులు పార్టీ పాలసీని వివరంగా విన్నమీదట మన పక్షానికి వచ్చారు. వీరు సంతకాల ఉద్యమంలోను, పార్టీ ఫండును వసూలు చేయటంలోనూ, పార్టీ అధ్యయన తరగతులకు హాజరు కావటంలోను చురుకుగా నున్నారు. (వీరు ఇదివరకు ప్రస్తుత ఉద్యమంలో చురుకుగావున్నవారు.) పార్టీకి సానుభూతిపరులుగా వీరు జేరారు. రాజమండ్రిలో కొంత మంది నిరుత్సాహం చూపినా, ఎక్కువమంది ఈ పద్ధతి బాగుందన్నారు. వైస్రాయికి విజ్ఞప్తిమీదమాత్రం సంతకాలు పెట్టారు. కృష్ణాజిల్లా కైకలూరు తాలూకాలో కాంగ్రెసు అభిమానులైన కొంత మంది యువకులు పార్టీ పాలసీని అంగీకరించి అధ్యయన తరగతులకు హాజరౌతున్నారు. బందరు తాలూకాలో ఇదివరకు సత్యాగ్రహం చేసిన ఒకరు పార్టీపాలసీని అంగీకరించి మన కామ్రేడ్స్‌తో కలిసి సంతకాలు పెట్టించాడు. మరొక కాంగ్రెసువాది నాయకుల విడుదల అవుసరాన్ని గుర్తిస్తూ సంతకాలు పెట్టాడు. మరొకరు పంథా నంగీకరిస్తూ జండాలనమ్మాడు ఇంకొకరు మొదట్లో సంతకంపెట్ట నిరాకరించినా, పార్టీ పంథానంతా విన్నపిమ్మట సంతకం చేశాడు. దివితాలూకాలో కాంగ్రెసు అభిమానియైన పెద్దరైతు ఒకరు మన పంథాయే దేశాన్ని రక్షించగలదని నమ్మి 7 మైళ్ళ దూరంవెళ్ళి సంతకాలు పెట్టించుకువచ్చాడు. గుడివాడ టౌన్‌లో కాంగ్రెసువాది ఒకరు పార్టీ పంథా నంగీకరిస్తూ ప్రచారంలో పాల్గొన్నాడు.

ఈ టౌనులో ఉపాధ్యాయులు చాలామంది సంతకాలు చేయటం గమనించతగ్గ విశేషం. గన్నవరం తాలూకాలో 4 గురు అధికారులు సంతకాలు చేస్తూ విరాళాలుకూడా ఇచ్చారు. కపిలేశ్వరపురంలో 5 గురు కాంగ్రెసువాదులు మొదట్లో పార్టీని దూషించినా, ఈ పార్టీ పంథానంతనూ వివరంగా విన్నమీదట తమ పొరపాటును ఒప్పుకుంటూ వైస్రాయికి విజ్ఞప్తిపై సంతకాలు చేశారు. నందిగామలో కాశేశ్వరరావుగారి అక్కగారుకూడా 'కమ్యూనిస్టులు దేశంకోసం ఎంతో పాటుబడుతున్నారు'అంటూ ప్రశంసించి ఒక్క జండానుకొన్నది. నెల్లూరు జిల్లా కోవూరు తాలూకాలో కొందరు స్థానిక కాంగ్రెసు వాదులు కామ్రేడ్సుతో కలిసి టిక్కెట్లు అమ్మడానికి, సంతకాలు చేయించడానికి సహాయపడ్డారు. కొన్నిచోట్ల పంథాను అంగీకరించినా, తమ నాయకులను కనుక్కొనిదే సంతకాలు చేయమన్నారు. తలమంచి, ఊటుకూరు గ్రామలలో కాంగ్రెసువాదులు కూడా పార్టీ పంథా నంగీకరించి సహాయక సభ్యులుగా జేరారు. మదనపల్లిలో కమ్యూనిస్టుల కార్యక్రమమే నేటి ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఎదుర్కొనుటకు సరియైన మార్గమని ఒక కాంగ్రెసువాది అంగీకరించాడు. కొంత మంది ప్రస్తుత అరాజక చర్యలకు కాంగ్రెసు ప్రోత్సాహం లేదనీ, అట్టి అరాజక చర్యలు జపాను ఫాసిస్టులకే అనుకూలమని తెల్పారు. పార్టీ పాలసీని వివరంగా విన్న ఒక మద్రాసు కాంగ్రెసువాది 'పార్టీ పంథాయే సరియైనది' అని ఒప్పుకున్నాడు.

అన్ని జిల్లాలనుండి వచ్చిన రిపోర్టులబట్టి కాంగ్రెసు వర్కర్లలో అధికమైన నిరుత్సాహం వ్యాపించియున్నదని తెలుస్తున్నది. ఈ నిరుత్సాహమే అపజయ భీతిని కూడా కల్గించగలదు. జాతీయోద్యమ వినాశనానికి దారి తీయగలదు. కాని జాతీయైక్యతా ప్రచారంవల్ల కాంగ్రెసు వర్కర్లు క్రమ క్రమంగా పార్టీ చూపించిన పంథాయే జాతీయ రక్షణకు, దేశ స్వాతంత్ర్యానికి దారి తీయగలదు అని తెలుసుకుంటున్నారు. ఫార్వర్డు బ్లాకిస్టులు, ఫాసిస్టు యేజంట్లు కలిగించిన దురభిప్రాయాలను క్రమంగా వదలుకొంటున్నారు; వీరి ప్రభావములోనుంచి తప్పుకుంటున్నారు. ఏ విధంగా ఫార్వర్డు బ్లాకు జపాను యేజంట్లుగా పనిజేస్తున్నారో, క్రమంగా కాంగ్రెసు వర్కర్లు, ప్రజాసామాన్యం తెలుసుకుంటూ వుండటంవల్లనే ఒక ఫార్వర్డు బ్లాకు మహా నాయకుడు తాను బ్లాకులో లేనని చెప్పుకుంటున్నాడు. కాబట్టి కాంగ్రెసు వర్కర్లలో గలిగే యీ పరిణామం జాతీయోద్యమాభి వృద్ధికి దోహదం యివ్వగలదు; ఇది మన పార్టీ విజయ చిహ్నం. పార్టీసభ్యులందరూ బోల్షివిక్కు పట్టుదలతో ఐక్యతా వుద్యమాన్ని పైస్థాయికి తీసుకుపోతే వినాశకరమైన నేటి విధ్వంసక చర్యలన్నీ అణగారిపోతాయి. దేశ రక్షణకు, దేశ స్వాతంత్ర్యానికి దారితీసే జాతీయైక్యత, కాంగ్రెసు-లీగు ఐక్యత సిద్ధించగలదు:

మహజర్లపై సంతకాలు (20-11-42) వరకు

జిల్లా	గ్రామాలు	జిన్నాకు	కాంగ్రెసుకు	వైస్రాయికి
విశాఖపట్నం	15		2051	3737
తూర్పు గోదావరి	3		151	327
పశ్చిమ గోదావరి	59	12	2162	2647
కృష్ణ	410	603	39039	40007
గుంటూరు	80	360	10284	10935
నెల్లూరు	64	268	4912	5081
చిత్తూరు	5	161	265	728
అనంతపురం	11			917
కర్నూలు	12	26	768	785
	659	1430	59632	65164
28-10-42 కు ముందు అన్నిజిల్లాలు	262			25500
మొత్తం	921	1430	59632	90664

ఆకలి ఆగదు!

ఆలస్యమేమాత్రము కూడదు

రాయలసీమ కరువులకు పుట్టినిల్లు. ఇంచుమించు ఏటేట ఘోరమైన కరువు బాధలు కలుగుతూన్నప్పటికీ, అక్కడి రైతాంగం ఈ బాధలకు బలికాకుండా చేయడానికి అధికారులు ఏమిచేశారు? శాశ్వత నివారణోపాయమేమయినా ఆలోచించారా?

ఈ సంవత్సరం చూడండి! అప్పుడే కరువు - కాల్చే కరువని ఒక విలేఖరి అంటున్నాడు- సాధారణంగా ఆసీమలో వర్షాలు ఏడాదికి పదిహేనేనట - ఈ సంవత్సరం అవికూడా దాగున్నాయట- చేతికందిన పంట, చూస్తూ వుండగానే మాడి మసి అయినట్లయిందట. రాయలసీమకు జీవనాధారము మెట్టపంట. ఆమెట్టపంట ఎండిపోతే అక్కడి రైతులకు కడుపుమంటతప్ప వేరేగతి ఏముంటుంది? ఇక ఈ యుద్ధపరిస్థితులవల్ల అధికంగా కలిగేబాధలను వేరే చెప్పనక్కర్లేదు.

ఇలాంటిపరిస్థితులు ఈసంవత్సరం మరింత తీవ్రంగావున్నాయని వార్తలు వస్తున్నాయి. పంట లెండిపోవడం- ధరలు హెచ్చిపోవడం వల్ల రాయలసీమ రైతులు క్రుంగి కృశిస్తున్నారు. వారి గొడ్లు ఎండినచెత్తను ఏరుక తింటున్నాయి. అధిక లాభాలే ముఖ్య ఆశయంగా పెట్టుకున్న వర్తకులు వున్న ధాన్యం కాస్త రైతులకు అందనీయకుండా నిలువచేసి, ధరలు ఇంకా పెంచుతున్నారు.

ఇలా బాధల్లోపడి ప్రజలు నలిగిపోతూ వుంటే, వారిబాధలు తీర్చి, యుద్ధపరిస్థితులకు అత్యవసరమయిన ఆహారపదార్థాల వుత్పత్తిని హెచ్చించడానికి అధికారులు ఏమయినా చేస్తున్నారా, అని చూస్తే ఏమీలేదు. ధరలను కంట్రోలుచేశారేగాని, సరుకు చాలినంత సప్లయి అయ్యే ఏర్పాటేమీ లేదు. కంట్రోల్ ధరలకు అమ్మడానికి ఇష్టంలేక వర్తకులు సరకునుదాచుకొని, ఇష్టంవచ్చిన ఆటలాడుతున్నారు. వారి ఆటలకు తాళం వాయిస్తున్నారు అధికారులు. పైగా సహాయాన్ని కోరి దగ్గరకు వచ్చినవారికి వెర్రిమొర్రి సమాధానాలు చెబుతున్నారు అధికారులు. పత్తికొండ తాలూకాలోని కారుమంచి ఫిర్కా రైతులు తమ ఆకలిబాధ పోగొట్టడానికి కరువుపన్నులు ప్రారంభించవలసిందని కర్నూలు జిల్లాకలెక్టరుతో మొరపెట్టుకుంటే- పరిస్థితులు అంత ముంచుకుపోలేదు — ఇంత త్వరలో పనులు ప్రారంభించడానికి వీలులేదని చెప్పారట. వీరి అభిప్రాయమేమిటో — వీరికే తెలియాలి. ఆకలిమంటలకు ఆగలేక — కళ్ళ ఎదుట కళేబరాలు రాలిపోతుంటేనే కాబోలు వీరు పనులు ప్రారంభిస్తారు! పత్తికొండ తాలూకాలో ఇలాగే ప్రజలు మొరపెట్టుకుంటే అక్కడ అధికారులు ప్రయాణమై వెళ్ళి, తనిఖీ చేసివచ్చి "కరవు ఏర్పడింది" అని తలచి రిమీషన్ శిఫార్సుచేశారట. తిండికిలేకచస్తుంటే రిమీషన్లు ఎవరికడుపు నింపడానికో!

దేశంలో 'వుత్పత్తిని అధికంచేయండి' అని ఒకవైపు నినాదంఇస్తూ- ఈ వుద్యమంకోసం లక్షలకొలది ధనం వ్యయంచేయడం- మరోవైపు ఆ వుత్పత్తికి మూలాధారమైన రైతులోకపు యోగక్షేమాలపట్ల ఇలా నిర్లక్ష్యభావం చూపడం, ఇప్పటి ప్రభుత్వ స్వభావాన్ని కంటికి కట్టినట్లు స్పష్టపరుస్తుంది. ఇలాంటి నిర్లక్ష్యభావంవల్ల చివరకి ఈ యుద్ధ గమనానికి, తుదివిజయానికే ముప్పురాగలదని అధికారులు గుర్తించాలి. తమస్థితిని గుర్తించిన రాయలసీమ రైతులు- కరువు నివారణపనులు, నివారణ కేంద్రాల్లో ధాన్యపు సప్లయి; కరువు ప్రాంతాల్లో శిస్తు పూర్తిగా త్రోసి వేయడం; రైతు కూలీల అప్పులపై యుద్ధానంతరంవరకు మారటోరియం- ఈ అవసరాలను ఏమాత్రం ఆలస్యంలేకుండా సాధించడంకోసం జాతిమత భేదం లేకుండా, అందరూ ఒకటై ఏకముఖంగా అధికారులమీద ఒత్తిడి తేవాలి. ప్రజల స్థితిగతుల్ని సానుభూతితో గుర్తించగల జాతీయ ప్రభుత్వం ఏర్పడినట్లయితే ఈ బాధలు తప్పగలవని రాయలసీమ రైతులోకం గుర్తించి, జాతీయ నాయకుల విడుదలకు, జాతీయ ప్రభుత్వ స్థాపనకు తోడ్పడాలి. రైతులఇబ్బందులను తీర్చి- వారిని ఆకలిబాధ నుండి కాపాడడం యుద్ధ నిర్వహణకు చాల అవసరమని అధికారులు గుర్తించి, రైతులకు కావలసిన సరకులను కంట్రోల్ ధరలకు సప్లయిచేసే కో-ఆపరేటివ్ స్టోర్సు ఏర్పడేలా చేయాలి.

(9 వ పేజీ తరువాయి) కఠోరంగా సాధి వాళ్ళని బాధిస్తున్నారు. ఇద్దరెవరో నా పక్కను యిలా మాటాడుకుంటున్నారు.

"ఇంగ్లండులో జర్మనీవాడలాగే చేసేను. ఈవేళరాత్రి పదకొండు తరవాత వెన్నెల వస్తుంది. అప్పుడు వొచ్చి వూరంతా ధ్వంసధూళిచేసి వొదిలిపెడతాడు. లేకపోతే గప్చుప్‌గా పేరచూట్‌లు వేసుకుని దిగిపోతాడు".

ఇంతలో విశాఖపట్నం వేపు మేఘాలువేసి మెరుస్తూంది.

"అదుగోఫ్లడ్ లైట్లు వేస్తున్నాడు. చూడండి. నేను చెప్పలేదండీ యీవేళ తప్పదండీ."

మా యింద్రియాలన్నీ చెడిపోయేయి. ప్రతీ చప్పుడూ బాంబులాగో, యాంటీఎర్‌క్రాఫ్ట్ లాగో వినిపిస్తుంది. సాయంత్రం వూళ్ళో యెగిరిన ప్రతీగెద్దా, కాకీ, విమానంలాగే కనిపించేది. గాలికూడా విమానశబ్దంలాగే వినిపిస్తూంది.

మెయిలు వస్తున్నట్టు గంట వాయించేరు. బుద్ధిమంతులం కొందరం వెళ్ళియెలాగైనా ఆపవలసిందని స్టేషన్ మాస్టర్ని కోరేం. తనకా అధికారం లేదన్నాడు.

పన్నెండయింతరవాత ప్యాసింజరు వస్తున్నట్టు గంట కొట్టేరు. అతి ప్రయత్నంమీద, మావాళ్ళని మేలుకొల్పేను. యెవ్వరము టికెట్లు కొనలేదు. రైలు పొట్టపగిలేటంత యెక్కువగావున్నారు జనం. నేను ఇంకా చాలామందితోబాటు మెట్లమీద కళేబరాన్ని నిలబెట్టవలసివచ్చింది.

విజయనగరం వచ్చేసేం. అమ్మయ్య! ఆఖరికి విజయనగరంచేరుకున్నాం.

ఊరంతా మేలుకునేవుంది. ఎక్కడచూసినా బాంబుల సంగతులే మాటాడుకుంటున్నారు. బళ్ళమీదా, సైకిళ్ళమీదా, కార్లమీదా ప్రజలు వస్తూనేవున్నారు. ఒకదీలోనూ దేశం జపాను వాడిపరం అవుతుందన్న చింతేలేదు; తాను తప్పించుకవచ్చే నన్న మాటేగాని. పోతే బ్రిటిష్‌వాడి సొమ్ముపోతుంది. కొవ్వు అణగనీ. తనకేం? ఇలాగ ప్రజాహృదయాన్ని చేసిందెవరు?

కంఠంమీదికి కత్తివచ్చినప్పటికీ దేశీయులతో చాజీపడక, స్వరక్షణకి కత్తిఅయినా పట్టుకోవడానికి వీల్లేని నిరాయుధుల్ని చేసి- అభిమాననూ దూరదృష్టీ వున్నవాళ్ళు చేసే పనేనాయిది?

ఇల్లు చేరేసరికి అంతవరకూ నాకోసం గాభరాపడి, మావాళ్ళు అప్పుడే నిద్రపోతున్నారు. నేనుకూడా ఒక మంచంవాల్చుకుని, పడుకున్నాను.

ఆకలి, కాళ్ళపీకు, చలి, దోమలు- అయినా సగం నిద్రపట్టింది. కలలు, కలల్లో విమానాలే, బాంబులే; మా చుట్టు పక్కనున్న యిళ్ళవాళ్ళందరూ మేలుకుని వుండడం వల్ల, వాళ్ళు చేస్తున్న ప్రతిచప్పుడూ బాంబు శబ్దంలాగో తుపాకిచప్పుడులాగో వినిపిస్తూంది. యిప్పుడు నాభయం ఇంకా యెక్కువైంది. నాలోవున్న పిరికితనంకన్నా, ప్రజల పిరికితనం చూసి వాళ్ళలాగ నేనూ పిరికినై హడిలిపోతున్నాను.

మావాళ్లు ఒక్కొక్కళ్లే వొచ్చి నన్ను చూసి వెళ్తున్నారు. నిద్రమైకంలో వాళ్ళమాటలు కొద్దికొద్దిగా వినిపిస్తున్నాయి.

తెల్లవారేక కాలకృత్యాలు తీర్చుకుని బయటి కెళ్లేను. విశాఖపట్నంలో ఉద్యోగంచేస్తున్న నా స్నేహితు డొకతను వొచ్చేడు. తను ఆవేళే వుద్యోగంలో చేరవలసి వుందన్నాడు. పదిరోజులక్రిందటే తన్ని ఖాయంచేసేరన్నాడు. నా సలహా అడిగాడు. ఏంచెప్పడం?

"వందలూ, వేలూ తెచ్చుకుంటూన్న ఉద్యోగులుంటారక్కడ. ప్రమాదసమయాల్లో వాళ్ళకు కార్లు, సకల సదుపాయాలు ఉంటాయి. ఏదివున్నా, లేకపోయినా, రెండు వందల రూపాయల ఉద్యోగంచేస్తూ చచ్చిపోయానన్న సంతృప్తి అయినా వుంటుంది. నా బి. యే డిగ్రీ విలువ 35 రూపాయలేనా? ప్రమాదంవస్తే, అవిమాత్రం నిలుస్తాయా? వెళ్ళక మాడిపోయేకన్నా, వెళ్ళి చావడమే మేలు. ఏమంటావ్?"

నేనేమీ చెప్పలేక, అతన్నే నిశ్చయించుకోమన్నాను.

"బ్రతికుంటే కలుసుకుందాం, బ్రదర్" అంటూ అతడు దీనంగా వెళ్ళిపోయాడు.

పార్టీ ఫండు (20-11-42 వరకు)

జిల్లా పేరు	జండాలు	విరాళాలు	ఆభరణాలు వగైరా	ఆభరణాలు కాక మొత్తం
విశాఖపట్నం	3-14-0	2- 0-0		5-14-0
తూ॥ గోదావరి	16-13-0	538-13-0	1మంగళసూత్రం,2ఉంగరాలు	555-10-0
ప॥ గోదావరి	66- 6-0			66- 6-0
కృష్ణా	557- 8-6	2746- 6-0	15 గాజులు, 1 నల్ల పూసల గొలుసు; 1 కాశికాయగుళ్ళు; 1 మంగళసూత్రం; 5 వుంగరాలు; 8 లోలకులు; 2 ముక్కు పుడకలు; (బంగారువి), 10 పట్టాలు; 8 మట్టెలు; 1 వెండి కప్పు; 1 కుంకుమ బరిణె; 1 తలపిన్ను; 2 గిలకలు; 4 కాలి గజ్జెలపట్టాలు; 2 గంధపుగిన్నెలు; 2 గొలుసులు; 2 అందెలు; 1 తాయెత్తు; (రావలసినవి) 3 వుంగరాలు; 2 వెండి గ్లాసులు; 6 పట్టాలు; 1 భరిణె;(వెండివి). 2 దున్న పిల్లలు, ధాన్యం; నూలు చిలపలు; 1 ఇత్తడి బిందె.	3303-14-6
గుంటూరు	73- 2-0	2740- 4-9	ధాన్యం; నూలు చిలపలు	2813- 6-9
నెల్లూరు	17- 6-0	4642-14-0		4660- 4-0
చిత్తూరు	1- 4-0			1- 4-0
కర్నూలు జిల్లా		40-12-0		40-12-0
రైల్వే		63- 2-0		63- 2-0
	736- 5-6	10739- 7-9		11469 13-3

అనంతపురం విద్యార్థులను విడుదలచెయ్యాలి

స్పెషల్ కోర్టులుగాదు వారికి కావలసింది. ఫాసిస్టువ్యతిరేకప్రజాయుద్ధంలోకృషిచేయుడానికిస్వేచ్ఛ, అని ఆంధ్రవిద్యార్థులు, అనంతపూరు విద్యార్థినాయకుల్ని అరెస్టుచేసిన ప్రభుత్వానికి హెచ్చరిక చేస్తున్నారు.

జిల్లాఅంతా కలరా రగుల్కొపోయి, మరణసంఖ్య పెరిగిపోయిన రోజులలో, పల్లెపల్లెకు, ఇంటింటికి తిరిగి కలరా విజృంభణాన్ని అణచివేసింది, అనంతపూరు విద్యార్థులు.

స్థానిక విద్యార్థులకు జాతీయ విధ్వంసక కార్యాలకు మధ్య నిలచింది, విద్యార్థులకు పోలీసు లాఠీలకు మధ్య నిలచింది, అనంతపూరు విద్యార్థులు.

జాతీయ ఐక్యతా సాధనలో ఆంధ్ర విద్యార్థులకు మార్గగామి ఐంది అనంతపూరు విద్యార్థులు.

విద్యార్థి ఉద్యమాన్ని, జిల్లాలోని రాజకీయ శక్తులలో, ప్రధానశక్తిగా నిర్మించింది అనంతపూరు విద్యార్థులు.

అట్టి విద్యార్థుల నాయకుల్ని కాలేజీ లేబరేటరీని తగలపెట్టారన్న నిందమీద పోలీసులు అరెస్టుచేశారు. కేసు రుజువు చేసికోలేక పోతున్నారు. వారిని విచారించడానికి స్పెషల్ కోర్టులకోసం ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తున్నారు.

పూర్తి ఫాసిస్టు ప్రతికూలురైన ఈ విద్యార్థి నాయకులు, విధ్వంసక కార్యాలనుండీ, రెచ్చగొట్టే పోలీసు కుతంత్రాలనుండీ విద్యార్థులను తమ దేహాలను అడ్డుపెట్టి రక్షించిన వీరు లేబరేటరీని తగులబెట్టారన్న విధ్వంసకచర్య చేయరు. వీరిని వెంటనే వదలివేయాలని ఆంధ్రవిద్యార్థులు ఆందోళన గావిస్తున్నారు.

బెజవాడలో విద్యార్థిసంఘం ఈ పై భావాలతో ఒక మహాజరును మద్రాసు ప్రభుత్వానికిపంపింది. సుమారు 300 మంది విద్యార్థులు సంతకం చేశారు.

తటారి గ్రామంలో సమావేశమైన విద్యార్థివర్కర్లు, యువజనసంఘ నాయకులు ఒక తీర్మానం గావించారు. అనంతపూరు విద్యార్థుల్ని అరెస్టు చేయడం, ఆంధ్రవిద్యార్థి ఉద్యమంపై ప్రభుత్వం సవాలు చేయడం అన్నమాట. ఈ విద్యార్థి నాయకుల్ని ఏషరతులు లేకుండా విడుదల చేయాలి. వీరి విచారణకు స్పెషల్ కోర్టులను జారీచేయకూడదు. ఇది ఆ తీర్మానంలోని ముఖ్య విషయాలు.

రామచంద్రపురంలో 16-11-42 న విద్యార్థి నిరసనసభ జరిగింది. విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని తీర్మానించారు. పోలీసు అక్రమాన్ని ఖండించారు. ఆంధ్రదేశంలోని విద్యార్థులంతా వారికి అండగా నిలబడాలనీ, వారి కోర్టులో డిఫెన్సుకు తగిన ధన సహాయం సమకూర్చాలనీ నిశ్చయించారు.

కామ్రేడ్! నీ అడుగు జాడలలో-

"సోదరుడా! నీకు జోహారులు. నీవు పవిత్రమైన మార్గాన్ని చేపట్టావు. ప్రజా స్వాతంత్ర్యానికి, ప్రజాసౌఖ్యానికి జరిగే పోరాటానికి నీవు ఆహుతి ఐపోయావు. నీ అడుగుజాడలనే మేము. ఇదే నీసమాధి ముందు మా శపథం!" అనే పాటతో ప్రారంభమైంది. కామ్రేడ్ చాపల వెంకటేశ్వరరావు స్మృతి దినం బొంబాయిలో, 4 నవంబరు, 1942, "పీపుల్స్ వార్" ఆఫీసులో స్మారక చిహ్నంగా మీటింగు. కామ్రేడ్ అధికారి అధ్యక్షుడు. కామ్రేడ్స్ జోషి, జహీర్‌లు, 60 మంది విద్యార్థులు. కామ్రేడ్ వెంకటేశ్వరరావు జీవిత సారాంశం, అధికారి ఉద్రిక్త వాక్యాల్లో, ఈ విధంగా విన్నారు. "మనపార్టీ రహస్య జీవనపు రోజులు. కామ్రేడ్ వెంకటేశ్వరరావులో దీక్ష, పట్టుదల ఉట్టిపడేది. చీకటి, ఉక్క.., చెమ్మ - ఏమీ అతని తీవ్రకృషికి అడ్డువచ్చేవిగావు. తన పని చూచికొని, ముడుచుకొని కూర్చునే రకంగాదు ఇతను. ప్రెస్‌పనే గాకుండా, ఇంకా ఎన్నో పనులలో నేర్పరి అయ్యాడు. సాధారణంగా కమ్యూనిస్టు వర్కరుకు అనారోగ్య ప్రదేశాలు, నిరంతర శ్రమ, చాలని తిండి .... కామ్రేడ్ వెంకటేశ్వరరావు ఆరు నెలలు మంచ మెక్కాడు. క్షీణించిపోతున్నాననీ, ఇక మరణం తప్పదనీ గ్రహించాడు. కాని, అవంతైనా అధైర్యంలేదు. తన పార్టీయందే దృష్టి కేంద్రీకరించాడు. తను రహస్యజీవనం గడుపుతున్నాననే సంగతి మరవనేలేదు. మాకు ఆశ్చర్యం వేసింది. భక్తి కార్మికుడు, స్వయంకృషి....ఇవే ఇతని అచంచల దీక్షకు కారణాలు....ఒక సామాన్య కార్మికునికి ఇలా తరిఫీదు ఇచ్చి పైకి తెచ్చిన ఆంధ్రాపార్టీకిజేజేలు."

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ (జూనియర్) సానుభూతి తీర్మానాన్ని చదివాడు. ఆఖరున అంత ర్జాతీయ గీతం పాడబడింది.

మాకో వెలుగు చూపాడు

కామ్రేడ్ చాపల వెంకటేశ్వరరావు స్మారక దినోత్సవం బెజవాడ ప్రెస్‌వర్కర్ల సంఘం మొగల్రాజుపురంలో 14-11-42 న జరిపారు. కీర్తిశేషుడైన ఆ కార్మికవీరుని పటం ఊరేగించబడింది. అనంతరం కాట్రగడ్డ నారాయణరావు, ఎం. ఎల్. ఎ., గారి అధ్యక్షతక్రింద సానుభూతి సభ జరుపబడింది. కామ్రేడ్ కాట్రగడ్డ రాజగోపాలరావు ఉపన్యశించాడు. కామ్రేడ్ వెంకటేశ్వరరావు బెజవాడలో పుట్టి పెరిగిన ప్రెస్ కార్మికుడు. నిగ్గుదేలిన కమ్యూనిస్టు. బోల్షివిక్ లక్షణాలు ఆతనిలో మూర్తీభవించినాయి. అతని ఆశయాలు మన ఆదర్శాలు. అతని గుణాలు మన ఆశయాలు. అతని జీవితం మన కొక మార్గం.

పంటలు పండించే రైతుల కష్టాలు

దేశంలో ఉండే దరిద్రమంతా వీరిలోనే మూర్తీభవించి ఉంది. ప్రభుత్వం ఒక వంక, జమిందారు భూస్వామి ఇంకొకవంక, వడ్డీవ్యాపారి మరొకవంక- ఎవరికి వీలైనంత వరకు, ఈ బీదరైతును, కూలీని, పీల్చి పిప్పిచేస్తున్నారు.

కాని, ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో, స్వాతంత్ర్య యుద్ధంలో, దేశరక్షణలో, జాతీయ ఉత్పత్తిలో వీరికున్నపాలు, బాధ్యత - కార్మికులకు - తప్ప మరెవరికీ లేదు.

గుడిసెలో చీకటి కుండలో ఖాళీ!

ఇంత బాధ్యతగల ఈ బీద రైతాంగం నిత్య జీవనానికి పడే బాధలు ఇంతింత గాదు.

పండించడానికి తానైనా, తింటానికి తానుగాదు. అసలే స్వల్పజీతాలు. పోనీ, ఆ జీతాలతో నైనా కొందామంటే ధాన్యం బంగారంధర. 'గ్రామానికొక చౌక ధాన్యం డిపో' అని క్రిందటివారమే నినాదం ఇచ్చాం. ఏలూరు తాలూకా పెదపాడు, దెందులూరు గ్రామాలలో జరిగిన వ్యవసాయ కూలీ సభలలో కూడా చౌక డిపోలను తెరవాలని ప్రభుత్వానికి హెచ్చరిస్తూ తీర్మానం చేశారు. క్రిష్ణాజిల్లా రైతుసంఘం "కో ఆపరేటివ్ సేల్సు డిపో" స్థాపిస్తామని ప్రకటించటమే కాని, ఇంతవరకు స్థాపించలేదు, వాటిని వెంటనే స్థాపించాలనీ, ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసింది. అదేగాక దీనికొరకు కో-ఆపరేటివ్ రిజిష్ట్రారుకు, జిల్లా కలెక్టరుకు రాయబారాలు పంప నిశ్చయించింది.

ఈ కరువు బియ్యానికే గాదు. కిరసనాయిలు, అగ్గిపెట్టెలు, మొదలగు జీవితావసర వస్తువులకుగూడా ఈ కిరసనాయలు కరువు అన్ని గ్రామాలలోనూ ఉంది. నివారణకు ఒకటే మార్గం. ప్రభుత్వమే డిపోలద్వారా అమ్మకం చేయడం. తిరుపూరు తాలూకా కార్యనిర్వాహకవర్గం, గొల్లమందల గ్రామసమావేశంలో, ఈ కోర్కెనే వెల్లడించింది. సరిపోయినంత కిరసనాయలు దొరకపోవడంవల్ల, వర్తకులు అధికలాభాలవల్ల బీదజనం అపరిమిత బాధకు లోనౌతున్నారు. అందుకు ప్రభుత్వం కిరసనాయలు డిపోలను ప్రతి గ్రామం లోనూ తెరవాలి.

మాటలకు, చేతలకు వున్న భేదం

అధికోత్పత్తి, అధికోత్పత్తి అని ప్రచారంచేస్తే అధికోత్పత్తి కాదు. ఈ విషయం ప్రభుత్వం గ్రహించాలి.

పోతనూరు, తాళ్ళగూడెం, చాటపర్రులో బంజరు భూములు సాగుచేయబడ్డాయి. పంట శుభ్రంగా వృద్ధిపండినతర్వాత బంజరుభూములకు ప్రభుత్వం పెనాల్టీ నోటీసులు ఇచ్చింది. ఇది అధికోత్పత్తికి ప్రోత్సాహమో, అభ్యంతరమో, నిరంకుశాధికార వర్గమే చెప్పాలి. ఈ పెనాల్టీ నోటీసులను వెంటనే రద్దుచేయమని ఏలూరుతాలూకా వ్యవసాయకూలీలు ప్రభుత్వాన్ని కోరారు.

తిరుపూరు తాలూకాలో, చెరువు పడకలలో వర్జీనియా పొగాకు వేస్తున్నారు. దీని మూలాన ప్రధానమైన వరిపంటకు మోసం వస్తోంది. ప్రజాయుద్ధంలో పోట్లాడేవారు పొగాకుతాగే పోట్లాడుతారా! అధికోత్పత్తికి అడ్డంకి ఐన దీనిని ప్రభుత్వానికి తెలియపరచినా లాభం లేకపోయింది. "అధికోత్పత్తి" అబద్ధం గాకపోతే, హాస్యం గాకపోతే ప్రభుత్వం వెంటనే చర్య తీసికోవాలి.

ప్రభుత్వ బాధ్యత అంతలోపోలా. తిరువూరు తాలూకా-జమిందారీ ప్రదేశం. జమిందారీగిరిలో చెరువులు మరమ్మతు లేక హీనస్థితిలో ఉన్నాయి. ఈ మరమ్మతులు అధికోత్పత్తికి అవసరం. వాటిని జమిందారులు చేయరు. ప్రభుత్వం బాధ్యతవహించి, జమిందారులను ఒత్తిడిచేసి మరమ్మతులను చేయించాలని తిరుపూరు తాలూకా రైతుసంఘ కార్యనిర్వాహకవర్గం తీర్మానించింది.

పాపాలకల్లా భైరవులు

షాహుకార్లూ వీరినే, జమిందారులూ వీరినే, ప్రభుత్వం వీరినే, ... పీడించటం.

గుడివాడతాలూకాలో 18 గ్రామాలపై రు 17,750/- జరిమానా విధించబడింది. ఇందులో ఎక్కువభాగం కూలీ రైతులనుండి గుంజబడుతూంది. వీరికి ఈ చర్యలలో ఏమాత్రం సంబంధం లేదు. ఇందుకు వీరి వర్గ సంఘాలైన రైతుసంఘాల ప్రస్తుత రాజకీయ పంథాయే నిదర్శనం. ఈ జరిమానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి, అని గుడివాడతాలూకా రైతు సంఘ సాధారణసభ్యుల సమావేశం తీర్మానించింది.

ఎవరో వ్యక్తులు విధ్వంసకచర్యలు చేస్తారు. కాని వాని పరిహారం ప్రభుత్వం అందరిమీదా రుద్దుతోంది. విపరీతంగా ధరలుపెరిగి, ఇదివరకే ఆర్థికంగా ముప్పతిప్పలు పడుతున్న ఈ బీదరైతులమీద, కూలీలమీద సాముదాయక జరిమానాలు వేయబడుతున్నాయి. ఇది అన్యాయం అక్రమం, అనర్థదాయకం అని కృష్ణాజిల్లా రైతుసంఘం తీర్మానిస్తూ, ప్రభుత్వాన్ని వీటిని రద్దు చేయమని కోరింది. దానికై అవసరమైన ఆందోళన, తదితర ప్రజాసంస్థలతో చేయ పూనుకున్నది.

బాంబులు పడ్డనాడు

"ఈరా"

ఈస్టరు సెలవులకి యింటికి విజయనగరంవెళ్ళాను. నాబోటికొత్తపూజార్లకు సెలవులు శారీరక మానసిక విశ్రాంతులు యివ్వకపోవడమే గాకుండా ఐస్‌క్రీమ్‌లాగ క్షణంలో కరిగిపోవడం మామూలు. ఈవేళ పదిగంటలకు విశాఖపట్నంలో మా కచేరీటేబిల్ ముందు, యీ 8 రోజులూ పచ్చిపిట్టగా తిరిగిన నేను గుమాస్తా నైపోవలసివుంది.....

రైలు ఆలస్యంగా జేరింది. తిన్నగా జట్కాలో యింటికిపోయి, ఇంక ఏమాత్రమూ ఆలస్యం సహించని ఆఫీసు భక్తుణ్ణిగాబట్టి, వేసుకున్న నూటయినా విప్పకుండా టేబిల్ భోజనం చేసి సైకిలుమీద శరవేగంతో ఆఫీసోన్ముఖుడ నయ్యాను. టర్నరు సత్రపు, రీడింగ్‌రూమ్, కురపాం మార్కెటు దాటి దూసుకుంటూ పోతున్నాను. నా హేటుమీద టేబిల్‌ఫేన్ మోగుతున్న శబ్దం వినిపించింది. కుడిచేత్తో సిగరెట్ నోటికందించి, ఎడంచేత్తో బ్రేక్ మోతాదుగా బిగించి, దర్జాగా మీదికి చూస్తున్నాను. సిల్వర్‌వైట్ రంగువి రెండు విమానాలు కవాతునడకల్తో పోతున్నాయి నాతోవనే. విమానాశ్రయంలోనివి కాబోసని, నేను పోతూనేవున్నా మీదికిచూస్తూ. ఇంకో మూడు విమానాలు వరుసగా ఆరెంటినీ అనుసరిస్తూ నా నెత్తిమీదికొచ్చాయి. మొదటిరెండూ హార్బరుమీద వ్రేలాడుతున్నాయి. ఈమూడూ పోష్టాఫీసు దాటిపోయాయి. సైరెన్ కూత ప్రారంభమయింది. వెంటనే మెరుపులాగ అర్థమైపోయింది. జపాన్ ప్లేన్లు—జపాన్ ప్లేన్లు జపాన్ ప్లేన్లు !!

బట్టల కొట్టులో

సైర్లు సగంఅరిగిపోయేటట్టు బ్రేకులు హఠాత్తుగాబిగించి ఆపి, యింకా కొంచం నడుస్తున్న సైకిలు దాని ఖర్మానికి దాన్ని వొదిలిపెట్టి, ప్లేన్లకై పైకి చూడ్డంవల్ల వెనక్కి జారిపోయిన హేట్ సవరించుకుంటూ, యెదురుగా కనిపించిన బట్టలకొట్టులో దూరాను.

ఏంటీఏర్‌క్రాఫ్ట్ (విమానాలను కూల్చే ఫిరంగు) వరసపెట్టి పేల్తూంది. కొట్టులో నాలాగే దూరబడ్డస్త్రీలు సహజంగా యేడవడం మొదలుపెట్టారు. అభమూ శుభమూ యెరగని పసిపిల్లలుకూడా గోలపెడ్తున్నారు. వరుసగా హార్బర్‌లో బాంబులు పేల్తున్నాయి. మేంవున్న యిల్లు భూతంపంలాగ వొణుకుతూంది. పొదికాళ్ళమధ్య యిరికించి బట్టలమూటలమధ్య నక్కిన ఒక మంగలి భగవన్నామస్మరణకి దిగాడు. గత్యంతరంలేక నేను బీర్వామూల దూరాను. స్త్రీలకు వేదాంతపుంతలతో ధైర్యం చెపుతున్నాను: "చావువచ్చేప్పుడు మనం తప్పించుకోలేం. దానికి ముడిసిపోయి బెంబేరుపడ్డం తెలివితక్కువ కాబట్టి సర్వమూ విధికి వొదిలిపెట్టి, యిప్పుడుధైర్యంగా సంతోషంగా వుండడంమంచిది." కాని, నా వుపదేశాలన్నీ వాళ్ళకి గవ్వకి పనికొచ్చాయికావు.

ఒకావిడ యింటికెళ్ళి పోవడానికి ఫెర్రీ దొరుకుతుందా అని అడిగింది! ఇంకో ఆవిడ వాల్తేరులోవున్న తన అక్కగారింటి కెళ్ళిపోతానని మారాం చేసింది. అలాంటి సమయంలో దాక్కోకపోవడంవల్ల కలిగేప్రమాదాలు వాళ్ళకి సోక్రటిక్ మెథడ్‌లో నచ్చచెప్పేసరికి, నాపితృదేవతలు దిగి వొచ్చారు.

మొదట కొంత ధైర్యంగానేవున్న షావుకారు, వీళ్ళగాభరాచూసి వీరికిమాత్ర నమిలేసు. అతని కళ్ళల్లో నీరుకూడా తిరుగుతూంది. రెండురోజులక్రిందట వచ్చినది కొత్తసరుకు. తన పిల్లలు బొత్తిగా పసిపిల్లలు. తన సొంత గొడవలు నాతోమొరపెట్టడంమొదలుపెట్టాడు. ఆడవాళ్ళకిచ్చిన ఔషధమే యితనికీ యిచ్చి కొంచం స్థిమితపర్చాను.

ఏంటీఏర్‌క్రాఫ్ యెడతెరిపి లేకండా పేలుతూవుంది. ప్లేన్లు వ్యూహంగా తిరుగుతున్నాయి. అప్పుడప్పుడు బాంబులు పడుతూనేవున్నాయి. అలాగ కొంతసేపు తిరిగి సముద్రంవేపుపోయి మళ్ళా తిరిగివస్తున్నాయి. మొద్దులాగ నుంచున్న ఏరాకకొండకూడా భయపడుతూన్నట్టు కనిపిస్తూంది.

షావుకారు అదేపనిగా భయపడుతూంటే, కొంతవరకు సురక్షితమైన స్థలమని, రెండు బీర్వాలమధ్యనున్న కాళీలో దూరమన్నాను. నన్నొక సిగరెట్‌తో సత్కరించి, వాటిమధ్య యిరుక్కున్నాడు.

మామూలు చొప్పున ప్లేన్లు సముద్రంవేపు పోయాయి. ఊరిమీదికి రావడం వాడి వుద్దేశం కాదని బోధపర్చుకుని, చప్పున సైకిల్‌మీదికి లంఘించి, యింటితోవ పట్టాను. స్టీల్‌హెల్మెట్ అనుకుంటారేమోనని, మెషిన్‌గన్ చెయ్యకండా, హేట్‌తీసి సైకిల్‌కి తగిలించాను.

నేనింటికెళ్ళేప్పటికి మావాళ్ళు యింట్లో యేర్పరచుకున్న నిరుపద్రవస్థలంలో ముగ్గుతున్నారు. బ్రతికున్న నన్నుచూసి సంతోషపడ్డారు.

రైలు స్టేషనులో

విశాఖపట్టణంనుండి బయటపడ్డం యెలాగా అన్న ఆలోచనలో పడ్డాను. రైలేమన్నా ఉన్నదేమో కనుక్కుందామని వాల్తేరు స్టేషనుకి సైకిలేసుకొని బయలుదేరాను. ప్రజలుగుంపులు గుంపులుగా మూటా ముల్లే పట్టుకొని వూళ్లో నుండి ప్రవహిస్తున్నారు. కొందరు కాలి నడకను తలొక వూరూ పోతున్నారు. శ్రమ పడలేని నాబోటి ఖుషీజవులు స్టేషనుకు పోతున్నారు రైలుంటుందన్న ఆశతో.

నాతో విజయనగరంనుండి బయలుదేరిన జట్టంతా స్టేషన్ రిస్టారెంటుముందు సమావేశమై వున్నారు. బంగాళీ టికెట్ ఇన్‌స్పెక్టరు ఒకడు నా దగ్గర చేరాడు. ఏ మూలనించి ప్లేన్లు వస్తాయో అని ఊర్ధ్వముఖుడై ప్రాణాలు పిడికిట్లో పట్టుకొనివున్నాడు. ప్లాట్‌ఫారంమీదున్న మెయిల్ కాస్సేపట్లో పోతుందికాబట్టి దానిమీద పోవచ్చునని అతడు అభయమిచ్చాడు. నడిచిపోయే బాధ్యత తప్పింది కదాఅని, ఒళ్ళుదాచుకునే, నా మిత్రబృందమంతా సంతోషించింది. సామాను పట్టుకవస్తానని, చెప్పి యింటికి బయలుదేరాను. కాని బళ్ళులేవు. కూలివాడికోసం వెతికేను. కొంపలు కూలే సమయంలో కూలివాడు కావాలి, నా దర్జాకి! అత్యావశ్యకాలైన కొద్ది బట్టలూ, షేవింగ్‌సెట్టూ, కొన్ని సాహిత్య పుస్తకాలూ, చేతిపెట్టిలో కుక్కి, విశాఖపట్నాన్ని మళ్ళా యీ రూపంతో చూస్తానా అన్న దిగులుతో వొక ఆఖరుచూపు చూసి మళ్ళీ స్టేషను చేరుకున్నాను.

నేను వచ్చేటప్పటికి మావాళ్ళు రైల్వే రిస్టారెంట్‌లో టీ తాగుతూ పొగ మబ్బులలో విహరిస్తున్నారు. నా పక్కన కూర్చున్నతను విమానదాడిని గురించి కవిత్వ మల్లుతున్నాడు.

"హార్బర్ పిప్పి పిప్పి అయిపోయిందండీ! మూడు వందలమందికిపైగా పచ్చడైపోయారు. విమానాలు నడుపుకొచ్చిం దెవరోతెలుసా? - ఆడవాళ్లు!!.....రేపిపాటికి వూళ్లోకి దిగిపోతారు. రంగూన్‌లో చెయ్యలేదూ? ఈ వేళే దిగిపోయుందును, ప్రజలికి కొంత టైం యిద్దామని వూరుకున్నాడుగాని——"

మేం బయటికొచ్చి ప్లాట్‌ఫారంమీద పచారీ చేస్తున్నాం. చెట్టుకొక పిట్టయి వచ్చేసినవాళ్లు, మర్నాటికి యెలాగ బ్రతికేదీ తెలీనివాళ్ళు, గొప్పవాళ్ళు, పేదవాళ్ళు, చంటి పిల్లలతో, వృద్ధులతో ప్లాట్‌ఫారం కిక్కిరిసిపోయింది. ఇళ్లఅద్దెలుపోయాయనీ, వర్తకం పాడైపోయిందనీ, ఇంటెడు సామాను వదలిపెట్టి వచ్చేననీ, కలిగినవాళ్ళు మొత్తుకుంటున్నారు. ఎవడి సౌఖ్యానికి యుద్ధం? రాజ్య దాహంతో పరాక్రమిస్తున్న దుర్దాహంవాడికా? సంపాయించుకున్నవన్నీ మూటకట్టి దాచుకున్న పిసనారి వాడికా? ఈ రాపిడిలో పిండయిపోతున్న నోరులేని బానిస ప్రజలకా? ఎవరికి? నానాటికి పెరిగిపోతున్న పన్నులు, యే క్షణాన బాంబులు పడి చస్తామో అన్న యాతన, వికృత వదనంతో తొంగి తొంగి చూస్తున్న కరువుకాటకాలు, పైకి యెగబ్రాకుతున్న దారిద్ర్యము, రాక్షసి ముండాకొడుకులు ఫాసిస్టులు సర్వాధికారాలతో కొవ్వి, కయ్యానికి కాలు దువ్వుతూ, ప్రపంచాన్ని క్షోభ పెడుతున్నారు. పక్షపాత రోగంతో వున్న ఆ ముసలివాణ్ణి, ఆ పురిటి పిల్లనీ, ఆ గుడ్డివాణ్ణి, ఆ నిండు గర్భిణిని, రక్షించే దెవరు?

సాయంత్రం నాలుగు దాటుతుంది. ప్రమాదము దాటిపోయిందని చెప్పడానికి ఏ. ఆర్. పి. వారు బాకా యూదుతున్నారు. ఇకనైనా రైలు కదులుతుందేమోనని గంపెడాశతోకూచున్నాం.

మళ్ళా ప్లేనులు

మళ్ళా వచ్చిపడ్డాయి ప్లేన్లు-బాకాధ్వానాలు. మేం రిస్టారెంట్‌లో దూరి, తలుపులు వేసుకున్నాం. ఈసారి వాల్తేరు స్టేషనుమీదికే వచ్చేయి ప్లేనులు. స్టేషనులోని జనమంతా ప్రాణాలు బిగబట్టుకొని కూచున్నారు. మాకు పది గజాల దూరంలో వున్న ఏంటీఏర్‌క్రాఫ్ట్ గన్ అదేపనిగా పేల్తూంది. విమానాలు మా మీద కాస్సేపుతిరిగి హార్బరువేపు పోయాయి. అక్కడ వాళ్ళు పైనించి బాంబు లెయ్యడం, క్రిందినుంచి వీళ్ళు తుపాకులు పేల్చడం. నా ప్రక్కనే వున్న రిస్టారెంట్ గుమాస్తా జేబులోని కానీతీసి మొలను దోపుకున్నాడు!!

మళ్ళా అవి స్టేషన్‌మీది కొచ్చాయి. మా ప్రాణా లెగిరిపోయాయి. ఈసారి స్టేషన్, లోకోషెడ్, ధ్వంసం చేస్తాడని అంటున్నారు. స్టేషనులో తుపాకీని చాలా చురుకుగా పేలుస్తున్నారు. ప్లేన్లు చెక్కు చెదరకుండా తిరుగుతున్నాయి. కొంచం వోపికపట్టి సైకిల్‌మీద పోయివుంటే ప్రాణాలు దక్కవుండేవిగదా అని నన్ను నేను నిందించుకుంటున్నాను. కళ్ళద్దాలూ, రిస్టువాచీ తీసి జేబులో పెట్టేను. కాళ్ళు తిమ్మిరెక్కుతున్నాయి, నిలువుటద్దాలుండడం వచ్చే ప్రమాదాన్ని రెట్టిస్తాయని రిస్టారెంట్ బంట్రోతుని, వాటిని తీసెయ్యమనిచెప్పి మేమంతా దాక్కొని వాణ్ణిపంపాం. ఎంత స్వార్థం! వాడు వెళ్ళాడో లేదో, బాబోయ్ అని తలపట్టుకొని వచ్చాడు. తలంట నెత్తురు కారుతోంది తుపాకి తిప్పడంలో గురితప్పి, రవ్వ ఒకటి వాడికి తగిలింది. పంచదార నేసి తలకి కట్టు కట్టాం.

కొందరి వ్యాఖ్యానాలు

కొంతసేపటికి విమానాలు మమ్మల్ని ప్రాణాల్తో వొదిలిపెట్టి, సముద్రం వేపు వెళ్ళిపోయేయి. ఒకాయన "ఇది సెకెండువార్నింగ్, మరి క్షమించడ"ని రూఢిగా చెప్పేసేడు.

"ఏమి శాంతమండీ! కిందనుంచి తుపాకితో కొడుతూంటే, రవ్వంతైనా కోపం తెచ్చుకోక, వొక్క చీమనైనా చంపకుండా, వెళ్ళిపోయేదండీ, ప్రాణదాతండీ, గాంధీ అండీ, ఏసుక్రీస్తండీ!" అని మొదలుపెట్టేడు ఒక జపానుదూత, బ్రిటన్‌కి రహస్యంగా వ్యతిరేకంగా మాటాడేవాళ్ళంతా, యీ క్షణంనించీ ధైర్యంగా, వ్యతిరేకంగా, మాటాడుతున్నారు. జపాను బాంబులు పడ్డంతోనే బ్రిటిష్ బావుటా దేశాన్నివొదిలి పారిపోయిందనుకున్నారువారు.

"సుభాష్‌బోస్ లేడండీ జపాన్లో? అతను జనరల్ టోజోతో మాటాడి, ప్రజల్నేమీ అనవద్దని చెప్పేడట! లేకపోతే మనమంతా యేమైపోయివుందుం?" అని అందుకున్నా డింకో ఆయన.

ఈ నిస్సహాయ జీవుల్ని చంపడానికి బాంబులు చిల్లపెంకుల్లాగ ఖర్చుపెట్టడని యేం తెలుస్తుంది వీళ్ళకి? నానాటికి భారతీయుల సానుభూతిని అభిమానాన్ని పోగొట్టుకుంటున్న బ్రిటిష్‌ప్రభుత్వం, ఆ సానుభూతిని, అభిమానాన్ని, జపాను ఆకర్షించేటట్టు చేస్తూంది. తప్పెవరిది? బాధపడేదెవరు? కళ్ళు మూసుకున్న ప్రభుత్వానిదా, బుద్ధి వుపయోగించని ప్రజలదా?—బాగుపడేవాడు మాత్రం జపానువాడు. మిత్రమండలి నిస్సత్తువగా కళ్ళు తేలవేసి చూస్తుందేం?

సింహాచలానికి నడక

ఆల్‌క్లియర్ (ప్రమాదం తొలగిపోయిందని సూచించే ఏ. ఆర్. పి. బాకా) యిచ్చేదాకా, రైలు కదులుతుందని నమ్మకంలేదు. ప్రాణాలు దక్కించుకోవడానికి శ్రమపడి యేడు మైళ్ళు సింహాచలానికి నడవడానికి తీర్మానించుకున్నాం. రైలేదన్నా తోవలో కనిపిస్తే, ఆపి యెక్కి పోవచ్చునని, పట్టాలుద్వారా నడక సాగించేం. లోకోషెడ్ దాటేం, ప్రాణాలు కుదుటపడ్డాయి.

నాకు చేతిపెట్టె వొకటి వుందిమోతకి. మమ్మల్ని వెంబడించి వొకడు వస్తున్నాడు. మనిషి పేదవాడిలాగ వున్నాడుగాబట్టి వాడిచేతికి యీ పెట్టె అందించేను. కూలి యిస్తానన్నాను: సరేనన్నాడు. మానీమానని కడుపుకోతతో వాడు హాస్పిటల్‌నుండి పారిపోవస్తున్నాడు. మాతోవున్న కేటరింగ్ కంట్రాక్టర్ "ప్రియా మిలనకోజానా" మొదలుపెట్టేడు.

రాత్రి యేడున్నర అయేసరికి కాళ్ళీడ్చుకుంటూ సింహాచలం వచ్చేసేం. జనం విపరీతంగా కూడేరు స్టేషన్లో. మాలో చాలామంది మధ్యాహ్నం కూడా భోజనం చెయ్యలేదు. నాకు భయం తగ్గి ఆకలెక్కువైంది. స్టేషన్లో తినడానికేమీ లేదు. సోడాలుమాత్రం ఉన్నాయి. వూరికే ఇచ్చినట్టుసంతోషించి ఒకసోడాతాగేను. ఐపోయేయట. తినడానికిలేదు. తాగడానికిలేదు. ఆఖరికి కాల్చడానికి కూడా లేదు. మావాళ్ళెంతో సుకుమార్లు, దర్జాపురుషులు. స్టేషన్ చప్టామీద నడుములు వాల్చేరు. నాకు బడలికను మీరిపోయిన ఆకలి. అన్నివక్కలా తిరిగేను యేమైనా దొరుకుతుందేమోనని. ఏమీలేదు. మావాళ్ళు దోమల్తోకొట్టి నిద్రపోతున్నారు. కొందరు ప్లాట్‌ఫాంమీద వంటలుచేసుకుంటున్నారు. కొందరు సంగీతం

(మిగతా 7వ పేజీలో)

సప్రూ సూచించుతూన్న అతుకుల బొంత

కామ్రేడ్
మద్దుకూరి చంద్రశేఖరరావు

హౌస్ ఆఫ్ కామన్స్ హౌసు ఉపన్యాసంలో చర్చిల్ తాను బ్రిటీషు సామ్రాజ్యాన్ని కాపాడటానికే ప్రధానిగా వున్నానని, సామ్రాజ్యవాద దురహంకారాన్ని వెదలగ్రక్కుతూ ఉపన్యసించాడు. యుద్ధంలో వరుసగా అనేక అపజయదెబ్బలు తిన్నాక వచ్చిన ఉత్తరాఫ్రికా విజయంతో ఈ ముసలి సామ్రాజ్యవాది కన్నులు మిరుమిట్లుగొల్పాయి. స్మృగిరిం పర్వానికి రంకెవేసే ముసిలి ఎద్దువలే, 19 వ శతాబ్దంలో బ్రిటీషు సామ్రాజ్యవాదం చెలాయించిన ప్రపంచాధికారాన్ని నిలబెట్టు కుంటానికి చర్చిల్ కాలుదువ్వుతున్నాడు. ఆఫ్రికాలో మిత్ర రాజ్యాల విజయానికి కారణం సోవియట్ యూనియన్‌లో చావుదెబ్బలు తింటున్న హిట్లరు, ఆఫ్రికా రంగానికి సైన్యాలను పంపలేకపోవడమేనని ప్రపంచ ప్రజలందరూ ఎరుగుదురు. నేడు ఉత్తరాఫ్రికాలో సర్వస్వం అర్పించి పోరాడుతున్న మిత్రరాజ్యాల సైనికులు, ప్రజాస్వాతంత్ర్యం కొరకు పోరాడు తున్నారు. చర్చిల్ గొంతెమ్మ కోర్కెల రక్షణకొరకు కాదు. ఫాసిస్టు దురంతకుల బానిసత్వాన్నుంచి ప్రపంచప్రజలను విముక్తి చేయడానికి, రక్షించడానికి వారు పోరాడుతున్నారు. వీరశైనా ప్రజలు, సోవియట్ రెడ్‌ఆర్మీ పోరాటి ఫాసిస్టు ముఠా రక్తం స్రవింపజేయడం వల్లనే ఉత్తర ఆఫ్రికాలో తమకు విజయం లభించిందని వారెరుగుదురు. అనుభవం ద్వారా విజ్ఞానం పొందుతున్న ప్రపంచ ప్రజలు సామ్రాజ్య వాదపద్ధతే యుద్ధాలకు కారణమని తెలసికొన్నారు. చర్చిల్ సామ్రాజ్యవాది కలలను వారు కల్లలు చేసితీరుతారు.

అమెరీ పిడివాదం

ఇండియామంత్రి అమెరీ కాంగ్రెసు నాయకులతో రాయ బారాలకు అవకాశం యివ్వబడదని స్పష్టంగా తెలియజేశాడు. బర్మాలో బ్రిటిషు ప్రభుత్వపాలసీని గురించి అడిగిన ప్రశ్నకు జవాబుగా అమెరీ బర్మా ప్రతినిధులు చాలమంది ఆక్రమిత బర్మాలో వుండిపోవుటచే వారితో సంప్రదింపులు సాధ్యపడ లేదని చెప్పాడు. కాని ఇండియా తమ చేతుల్లోనే వుంది. ఇండియాలో సంప్రదింపులు జరిగితే పరిష్కారం కుదిరిపో తుందనే భీతిలో తమ అధికారం వదలుకోడానికి ఇష్టంలేక, జైళ్ళలోని కాంగ్రెసు నాయకులతో రాయబారాలకు అమెరీ అడ్డుపెడుతున్నాడు. బర్మాకు స్వాతంత్ర్యం యివ్వడానికి యిష్టంలేక, బర్మా ప్రతినిధులు జపాన్ ఆక్రమిత ప్రదేశంలో వుంటుటచే, సంప్రదింపులు అసాధ్యమంటున్నాడు. ఈ రెండు జవాబుల వెనకాలవున్న మనస్తత్వం ఒక్కటే. సామ్రాజ్య అధికారాన్ని వదులుకొన నిరాకరించడం మాత్రమే వాటి ఆశయం.

తెరఎక్కుబొమ్మా ! తెరదిగుబొమ్మా !!

లేబర్ నాయకుడు హెర్బర్టు మారిసన్ బ్రిటీషు ప్రభుత్వపు ఇండియా పాలసీని బలపరుస్తూ అమెరికన్ ప్రజలకు 18 వ తేదీన బ్రాడ్‌కాస్టు ఉపన్యాసం యిచ్చాడు. సామ్రాజ్య వాదులకు తాము అనుసరించే పాలసీలోవున్న కాలకూట విషాన్ని అమృతంగా ప్రచురించడానికి క్రొత్త ప్రచారకులు కావాలి. బ్రిటీషు కార్మికులలో పలుకుబడివున్న అవకాశవాదిష్టు (స్వార్థపరులగు) నాయకులను తమపని చేయించుకోడానికి సామ్రాజ్యవాదులు ఉపయోగించుకోడం పరిపాటి. భారతదేశ సమస్యలో సర్‌స్టాఫర్డ్‌క్రిప్సును ఉపయోగించుకున్నారు, సామ్రాజ్యవాదులు ఆడించినట్లల్లా ఆడి, పరువు గోల్పోయిన క్రిప్సు ప్రజలను మోసపుచ్చడానికి యింకపనికిరాడు. అందుచే మారిసన్ అనే క్రొత్త కీలుబొమ్మ సామ్రాజ్యవాద నాటక తెరమీద ఎక్కింది. 23 వ తేదీ వార్తలు సర్‌క్రిప్సు యుద్ధ మంత్రివర్గంలోనుంచి తొలగింపబడ్డాడనీ మారిసన్ ఆస్థానం లోకి తీసికోబడ్డాడనీ చెబుతున్నాయి. అంటే పాతబొమ్మ దిగి కొత్తబొమ్మ ఎక్కిందన్నమాట. సక్రమంగా రాంకే మార్గోనాల్డుకు పట్టినగతే, క్రిప్సుకు లభ్యమవుతుంది, తరువాత మారిసన్‌గతీ అంతే, ప్రజానాయకులు ఎవరి భుజస్కంధాలపై పైకి వచ్చారో ఆ ప్రజలను మరచి పాలకవర్గానికి దాసులైన వారిగతి యింతే.

ఆట రక్తి కట్టడంలేదు

సామ్రాజ్యవాదులు సాగించుతున్న యీ పాలసీని బ్రిటిషు, అమెరికన్ ప్రజలు తీవ్రంగా నిరశించుతున్నారు. సుప్రసిద్ధ రచయిత్రి అయిన పెరల్‌బక్ యిలా వ్రాసింది; "జపానుకు వ్యతిరేకంగా కీలకస్థానమైన చైనాకు సహాయం పంపాలంటేనూ, వేలకొలది అమెరికన్ సైనికుల జీవితాలు వృథాగా నష్టపరచకుండా వుండాలంటేనూ, అనవసరంగా యుద్ధాన్ని పొడిగించకుండా వుండాలంటేనూ, వెంటనే మిత్ర రాజ్యాలు భారత దేశ సమస్యలో జోక్యం కలిగించుకోవాలి." న్యూ స్టేట్స్‌మన్ అండ్ నేషన్, మాంచెష్టర్ గార్డియన్ పత్రికలు కాంగ్రెసు నాయకులతో సంప్రదించే అవకాశం యివ్వ నందుకు అమెరీని నిరశించాయి. న్యూ స్టేట్స్‌మన్ పత్రిక సంపాదకుడు అమెరికానుంచి పంపిన వార్తలో అమెరికన్ ప్రజలు కాలనీల విషయమై చర్చిల్ అవలంబించుతున్న పాలసీని అసహ్యించుకుంటున్నారని తెలియజేశాడు. మిస్. మూరెల్ సెల్‌హామ్ కూడా అదే విధమైన భావాన్ని తెలుపుతూ బ్రిటీషు ప్రభుత్వం తన కాలనీల పాలసీని మార్చుకోవాలని టైమ్సు పత్రికలో వ్రాసింది. బ్రిటీషు, అమెరికన్, కమ్యూనిష్టు పార్టీలు భారత స్వాతంత్ర్య సమస్య ప్రజా యుద్ధ విజయానికి యెలా అవసరమో తెలుపుతూ ప్రజలలో ప్రచారం చేస్తున్నాయి. బ్రిటిషు సామ్రాజ్యవాదుల యెత్తు పారదం లేదు. అమెరికన్ కార్మిక సంస్థలు భారత స్వాతంత్ర్యాన్ని బలపరచడమే యిందుకు ఉదాహరణ.

చిత్రం మహా ప్రభో !!

ఇటు భారత దేశంలో బ్రిటిషు ప్రభుత్వ ఏజెంట్లు తమ యజమానులైన బ్రిటిషు సామ్రాజ్యవాదుల ఆజ్ఞలను శిరసావహించుతున్నారు. రాజాజీకి కాంగ్రెసు నాయకులను కలిసికొనే అవకాశం యివ్వ నిరాకరించిన వైస్రాయికి వీరు పక్కా తాళం వేస్తున్నారు. డాక్టరు అంబేడకర్ వైస్రాయిని సమర్థించుచూ, జాతీయ ప్రభుత్వం అవసరం లేదన్నాడు. తమ ప్రభుత్వమే యుద్ధ కృషికి సర్వం చేస్తూందనీ, జాతీయ ప్రభుత్వం యింతకంటె యేమీ చేయలేదనీ చెప్పాడు; తాను భారత కార్మికులకు యెన్నో హక్కులు ప్రసాదించానని కోతలు కోశాడు. కాని వీని బూటకమంతా కార్మికులు యెరుగుదురు. అధిక ధరల అలవెన్సు యివ్వాలని కార్మికులెంత ఆందోళన చేసినా ప్రభుత్వం వినిపించుకోలేదు. పైగా అత్యవసర పరిశ్రమలు (Essential industries) అనే పేరులో కార్మికుల సమ్మె హక్కును భగ్నంచేసింది. దుర్భర దారిద్ర్యంతో

మన రాజకీయాలు

కుంగిపోతున్న భారత కార్మికు లెవరూ యీ అంబేద్కరు మాటలు విని మోసపోరు.

ఒకప్పుడు ప్రముఖ జాతీయవాది అయిన ఎం. ఎస్. ఆనే కూడా సామ్రాజ్యవాదులకు పక్కతాళం వేస్తున్నాడు. మధ్య రాష్ట్రాలలోజరిగిన నిర్బంధాలను విచారించవలెనని రాయబారం వెళ్ళిన ప్రొఫెసరుతో దీనికంతకూ గాంధీయే కారణమని దూషించాడని హిందూ పత్రిక ప్రకటించింది. సామ్రాజ్య వాదులకు చిత్తం ప్రభో ! అంటూ కార్యనిర్వాహక సభ్యులు ప్రజలకు దూరమయ్యారు. సమర్థించుకోడానికి సవ్యమైన వాదన లేనప్పుడు కోపంతో ముగించడమేగా చేతనైనపని ! రాయబారం వెళ్ళిన ప్రొఫెసరు అరెస్టు చేయబడ్డాడు కూడ. క్రిప్సు పతనానికి సాటి అనే పతనమే.

డెమాక్రటిక్ పార్టీ అని పిలుచుకొంటున్న రాయిస్టు ముఠా రాజాజీకి గాంధీని చూడటానికి అనుమతి యివ్వకపోవడం సబబేనని వైస్రాయిని బలపరుస్తూ తీర్మానించింది. ప్రజలతో సంబంధంలేక, ప్రజాభిప్రాయాన్ని గమనించకుండా తమవలే బ్రిటిషు సామ్రాజ్యవాదులను సేవించనివారంతా ఫాసిస్టులు అనే రాయిష్టులు ఆ విధంగా తీర్మానించడంలో ఆశ్చర్యంలేదు. నిర్బంధ విధానాన్ని బలపరుస్తూ అది ఫాసిజాన్ని యెదిరించడమనే వీరలు డెమాక్రట్సు (ప్రజా తంత్రవాదులు) కాదు. సామ్రాజ్యవాదానికి యేజంట్లు ఇంతేగాక వీరి చర్యలు భారత ప్రజల నందరినీ ప్రజా యుద్ధానికి విముఖుల్ని చేస్తాయిగాన, పరోక్షంగా ఫాసిజానికి సాయపడుతాయికూడ.

తోలు బొమ్మల ముఠా

ప్రభుత్వంచే భారత జాతీయోద్యమానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి పంపబడిన సర్ జఫ్రుల్లాఖాన్, బేగం షానవాజ్ గార్లున్యూయార్కులో ఉపన్యసించారని రూటరువార్త వచ్చింది. బేగం షానవాజ్ ఇండియాలో యుద్ధ కృషి సంతృప్తికరంగా జరుగుతోందని చెప్పింది. సర్ జఫ్రుల్లాఖాన్ కాంగ్రెసు పాకిస్థాన్‌ను అంగీకరించా లన్నాడు. అంతవరకూ బ్రిటిషు అధికారం తొలగిపోవాలని కోరకూడదట. సూత్రధారుడు తాను లాగినట్లల్లా ఆడుతూ వీరు భారత ప్రజల ప్రతినిధులమనే వేషాలతో ప్రపంచాన్ని వంచిస్తున్నారు.

భారతదేశంలోని అన్ని పత్రికలు రాయబారాలకు అనుమతి యివ్వనందుకు, వైస్రాయిని, అమెరీని, తీవ్రంగా విమర్శించాయి. మితవాద నాయకులైన సెతల్వాడ్, కుంజ్రూ, సప్రూ వగైరాలు వైస్రాయి చర్యను నిరసించారు. హిందూ మహాసభ నాయకులు కూడ విమర్శించారు. డాక్టరు సుబ్బరాయన్ ఈ నిరాకరణవల్ల ప్రతిష్టంభనను అంతమొందించే ప్రయత్నాలకు ఆటంకమేర్పడిందని ఖండించాడు.

సికందర్ సూచనలు

పంజాబు ప్రధాని పంజాబును తూర్పు పడమర భాగాలుగా విభజించాలనీ, రాబోయే రాష్ట్ర శాసన సభలో నూటికి 75 మంది భారత సమాఖ్యలో చేరడానికి ఒప్పుకొనకపోతే స్వతంత్రంగా ఉండాలని సూచించాడు. ఇది జాతీయ ఐక్యతకు మార్గంకాదు. ఇతడు జాతీయ ప్రభుత్వం మాటే తలపెట్టడం లేదు. ముస్లిం జాతుల స్వయంనిర్ణయ హక్కును కోరుట లేదు. స్వతంత్ర పంజాబు పేరుతో పంజాబును చీల్చాలని మాత్రం కోరుతూంది. యుక్తవయస్సు వచ్చిన ప్రజలందరి సమ్మతి స్థానే నూటికి 10 అయినా లేని రాష్ట్ర శాసన సభల ఓటర్లకు నిర్ణయాధికారం అప్పగించుతూంది. బ్రిటీషు సామ్రాజ్యవాదులనుండి ప్రభుత్వాధికారం జాతీయప్రభుత్వానికి వచ్చినప్పుడే ముస్లిం ప్రజాసామాన్యం యొక్క హక్కులు కాపాడబడుతాయి. బ్రిటీషు ప్రభుత్వాన్ని చిరస్థాయిగా వుంచడానికి మాత్రమే గావింపబడే విభజన హిందువులను ముస్లిమ్‌లను - ప్రజలందరిని బానిసలుగా వుంచడానికి మాత్రమే, ఈ సూచన ఉపయోగపడుతుంది.

సప్రూ సూచనలు

"రాజాజీ కోరే జాతీయప్రభుత్వం రాకపోతే మంత్రి వర్గం వైస్రాయికి బాధ్యత వహించి వుండాలి. వైస్రాయి పార్లమెంటుకు బాధ్యత వహించాలి" అంటూ సర్ తేజ బహదూర్ సప్రూ తన సూచనలను వివరించుతూ పత్రికా ప్రతినిధులతో చెప్పాడు. అదే సమావేశంలో సప్రూ "అమెరీ యీమధ్య చేసిన ప్రకటనలవల్ల యుద్ధం అయిన తరువాతనైనా బ్రిటీషుప్రభుత్వం యీ దేశాన్నుంచి వెళ్ళిపోతుందా అనే సందేహం కలుగుతోంది," అని చెప్పాడు. ఇంత సందేహం వచ్చినా యీ మితవాదనాయకుడు, అలవాటు వదలలేక వైస్రాయికి బాధ్యత వహించే మంత్రివర్గాన్ని కోరుతున్నాడు. వైస్రాయి జాతీయఉద్యమానికి నాయకత్వంవహించి అఖిల పక్షసభ పిలవాలట. కాంగ్రెసు శాసనోల్లంఘనాన్ని ఉపసంహరించుకోవాలనే షరతును వైస్రాయి కోరవచ్చునట. ఇండియా మంత్రిపదవిని తొలగించాలనీ, వైస్రాయికే బ్రిటిషు మంత్రి వర్గంలో శాశ్వతంగా ఒక స్థానం వుండాలనీ, యితడు సూచించాడు.

ఈఅతుకులబొతుకుల బొంతనుపరిశీలించి చూస్తే, సప్రూకు వృద్ధాప్యంలో మతిభ్రమ ఐనా కలగాలి, లేదా ప్రధాన రాజకీయ పార్టీలను మినహాయించి ఉద్యోగాలకోసం తహతహలాడేజీహుకుంరాయుళ్ళ కుట్రలో చేరడానికి సిద్ధమవుతూఐనావుండాలి. మిత్రరాజ్యాల విజయంకొరకు సర్వశక్తులూ ధారబోయడానికి జాతీయప్రభుత్వం ఏర్పరచమని కోరిన కాంగ్రెసునాయకులను వైస్రాయి జైళ్ళకు పంపాడు. ఆ వైస్రాయే అఖిలపక్ష సభను పిలువాలని కోరడం ఎండమావుల్లో నీళ్ళకోసం వెదకడంవంటిదే వైస్రాయికి బాధ్యతవహించే మంత్రివర్గం. జాతీయప్రభుత్వం కాజాలదు. ప్రస్తుతవైస్రాయి కార్యనిర్వాహక సంఘానికి యిది కొత్తనామకరణం మాత్రమే. ఏదో విధంగా పదవుల్లో దూరాలని చూచేవారికి యీ స్కీము నచ్చుతుంది గాని, ప్రజా ప్రతినిధులైన రాజకీయ పార్టీలు దీనికి ఆమోదింపవు.

మన కర్తవ్యం

ప్రజల శక్తిపై విశ్వాసం లేనివారికి సామ్రాజ్యవాదుల దయాధర్మభిక్షానికి ఎదురుచూడటం తప్ప గత్యంతరం కన్పించదు. కాని నిజమైన జాతీయప్రభుత్వాన్ని ప్రజాబల మొక్కటే సాధించగలదు. అందుకోసం దేశరక్షణలను ధ్వంసంజేసే పనులు స్వాతంత్ర్యానికి మార్గం కాదనీ, వ్యతిరేకమనీ, దేశభక్తులకు నచ్చచెప్పి మాన్పించాలి. అమెరీ, వైస్రాయిలు పెట్టే ఆటంకాలను లెక్కచేయకుండా ముస్లింజాతుల స్వయంనిర్ణయహక్కును గుర్తించి, హిందూ-ముస్లిం ప్రజాఐక్యతను నిర్మించాలి. తద్వారా భారతప్రజలందరి జాతీయైక్యతను నిర్మించాలి. నిరంకుశాధికారులవల్ల ప్రజలకు కల్గుతున్న యిబ్బందులను తీర్చడానికీ, యుద్ధకృషిని ప్రజాయత్తం చేయడానికీ, పోరాటం సాగించాలి. ఈవిధమైన ప్రజాఉద్యమం ద్వారా సంపూర్ణ జాతీయప్రభుత్వాన్ని గుంజుకోగల్గుతాము. యుద్ధాన్ని జయించి, భారత స్వాతంత్ర్యాన్ని స్థాపించ గల్గుతాము.

23—11—42

Published by Katragadda Rajagopala Rao and Printed at The Popular Printers, Governorpet, Bezwada'

END OF ISSUE